# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి:13 సంచిక:107 ఖమ్మం 6-01-2026, మంగళవారం పేజీలు: 8 వెల: 1.00


## రాజకీయ శక్తిగా తిరిగివస్తా: కవిత

హైదరాబాద్: శాసన మండలిలో కవిత తన రాజీనామాకు గల కారణాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె భావోద్వేగానికి గురయ్యారు. అదే సందర్భంలో కవిత కీలక ప్రకటన చేశారు. నేను ఈ రోజు వ్యక్తిగా బయటకు వెళ్తున్నాను.. రేపు ఒక శక్తిగా సభలోకి ప్రవేశిస్తాను అని అన్నారు.




# పోలవరం-నల్లమల్లసాగర్ ప్రాజెక్ట్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

ఢిల్లీ: పోలవరం-నల్లమల్లసాగర్ ప్రాజెక్ట్ విషయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్ట్‌పై మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించండి అంటూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు సూచించారు. అనంతరం, కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా చేశారు.

కాగా, నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై స్టే ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోరారు. ఈ ప్రాజెక్టుతో గోదావరిలో తమ వాటా తగ్గుతుందని తెలంగాణ ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్‌కు సంబంధించి మూడు పరిష్కారాలను సుప్రీంకోర్టు సూచించింది.

1. సమగ్ర విచారణ కోసం సివిల్ సూట్ ఫైల్ చేయమని సూచన

2. కేంద్ర ప్రభుత్వ కమిటీకి తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనలను పరిశీలించి, అవసరమైతే ప్రాజెక్టును ఆపే నిర్ణయాధికారాన్ని ఇస్తాం.

3. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుని అవకాశం ఇచ్చారు.

జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు..

అంతకుముందు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్లానింగ్ దశలోనే ఉంది కదా?. ప్లానింగ్ డాక్యుమెంటేషన్ ప్రిపరేషన్‌కి ఏపీ నిధులే వృధా అవుతాయి కదా?. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ పిటిషన్ విచారణ అర్హతను పరిశీలిస్తున్నాం. సివిల్ సూట్ ఫైల్ చేస్తేనే సమగ్రంగా విచారణ జరపవచ్చు. ప్రాజెక్టు ఆపాలన్న మీ అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వ కమిటీ పరిశీలించేలా చూడమని ఆదేశాలు ఇస్తాం. అలాగే మధ్యవర్తిత్వం ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకునే ప్రయత్నం చేయండి అని అన్నారు.

ఏకపక్షంగా నిర్మాణం..

అనంతరం, తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింగ్వి వాదనలు వినిపిస్తూ..'వరద జలాల పేరుతో మాకు కేటాయించిన నీటి వాటాను తరలించుకునే ప్రయత్నం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏకపక్షంగా ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. ప్రాజెక్టుపై వెంటనే సుప్రీంకోర్టు స్టే ఇవ్వాలి. గోదావరిలో తెలంగాణకు 968 టీఎంసీల నీటి వాటా ఉంది. పోలవరం-నల్లమల్లసాగర్ ప్రాజెక్టుతో మా వాటా తగ్గుతుంది. ఈ ప్రాజెక్టును ఆపాలని కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను ఏపీ పట్టించుకోవడం లేదు. సీడబ్ల్యూసీ చైర్మన్ నేతృత్వంలో ఇటీవల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ప్రాజెక్టును ఆపే అధికారం లేదు. సుప్రీంకోర్టు వెంటనే జోక్యం చేసుకొని ఈ ప్రాజెక్టును ఆపాలన్నారు.

రాష్ట్ర ప్రాజెక్ట్ మాత్రమే..

మరోవైపు.. ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. 'పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టులో వేము నిబంధనలు ఉల్లంఘించలేదు. కేవలం మేము ప్లాన్ రెడీ చేసుకుంటున్నాం. సముద్ర జలాలు వృథా అవుతున్నాయి. వాటిని రాయలసీమకి అందించాలనుకుంటున్నాం. ఇది రాష్ట్ర ప్రాజెక్టు మాత్రమే జాతీయ ప్రాజెక్టు కాదు. మా రాష్ట్ర అవసరాలపైన ప్లానింగ్ చేసుకునే అధికారం ఉంది. వేము పీఎఫ్ఆర్, డీపీఆర్‌లను తయారు చేస్తున్నాము అని తెలిపారు.

ఈ క్రమంలో సుప్రీంకోర్టు సూచించిన పరిష్కారాలపై తెలంగాణ ప్రభుత్వం నిర్ణయాన్ని తెలుసుకునేందుకు సమయం ఇవ్వాలని అభిషేక్ సింఘ్వీ కోరారు. అనంతరం, కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా చేశారు.

# నేను సంతోషంగా లేనని మోదీకి తెలుసు.. ప్రశంసిస్తూనే టారిఫ్‌లు పెంచుతానని హెచ్చరించిన ట్రంప్!



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీని ఒకవైపు ప్రశంసిస్తూనే మరోవైపు నుంచి చురకలు అంటించారు. మోదీ చాలా మంచి వ్యక్తి అని పొగుడ్తూనే.. తనకు నచ్చినట్లుగా చేయకపోతే సుంకాలు పెంచుతానని హెచ్చరించారు. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో విషయంలో చేపట్టబోయే చర్యల గురించి చెబుతున్న వేళ ట్రంప్ భారత్ గురించి కూడా ప్రస్తావించారు.

రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించిందని.. తనను సంతోషపెట్టేందుకే భారత ప్రధాని మోదీ ఈ నిర్ణయం తీసుకున్నారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. " వాళ్లు నన్ను సంతోషపెట్టాలని భావించారు. ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనన్న విషయం ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం చాలా ముఖ్యం. రష్యాతో వారు వ్యాపారం కొనసాగిస్తేం.. మనం చాలా వేగంగా టారిఫ్‌లు పెంచుతాం'' అని ట్రంప్ హెచ్చరించారు. దీనికి సంబంధించిన ఒక ఆడియా క్లిప్‌ను వైట్ హౌస్ ట్విట్టర్ (ఎక్స్) ఖాతాలో వెల్లడించింది.

ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై ట్రంప్ మాట్లాడుతూ.. రష్యా ఆర్థిక పరిస్థితి బాగోలేదని తెలిపారు. వెనెజువెలా ఆర్థిక వ్యవస్థ అయితే మరింత దయనీయంగా ఉందన్నారు. తాను చూసిన వాటిలో అత్యంత చెత్త ఆర్థిక వ్యవస్థ వెనెజువెలాదే అని పేర్కొన్నారు. కాగా, భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్న వేళ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అయితే గతంలోనూ రష్యా చమురు కొనుగోళ్లను తగ్గిస్తామని ప్రధాని మోదీ తనతో చెప్పారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# దేరాబాబాకు మరోసారి పెరోల్




ఆధ్యాత్మిక గురువు, డేరా స్వచ్ఛ సౌధా ఛీఫ్ గుర్మిత్ రామ్ రహీమ్ సింగ్‌కు మరోసారి పెరోల్ మంజూరయ్యింది. దీంతో ఆయన 40 రోజుల పాటు సాధారణ జీవితం గడపనున్నారు. ఈ పెరోల్ కాలంలో గుర్మిత్ బాబా సిర్సా హెడ్‌క్వార్టర్స్‌లో ఉండనున్నారని ఆయన తరపు న్యాయవాది తెలిపారు.

గుర్మిత్ రామ్ రహీమ్ సింగ్‌కు హర్యాణాలో చాలా మంది ఫాలోవర్స్ ఉన్నారు. అక్కడే కాకుండా పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ప్రాంతాలలో సైతం ఆయనకు భక్తులు ఉన్నారు. డేరాబాబా నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, స్వచ్ఛంద సేవ తదితర వాటి రీత్యా ఆయనపై ప్రజలకు అభిమానం అధికంగా ఉండేది. అయితే 2017లో ఆశ్రమానికి చెందిన ఇద్దరు మహిళలపై డేరాబాబా లైంగికదాడి చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ అంశం విచారించిన కోర్టు ఆయనను దోషిగా తేలుస్తూ 20 సంవత్సరాల జైలుశిక్ష విధించింది. ఈ నేపథ్యంలో ఆయన అరెస్టు అయ్యారు.

కాగా 2017లో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్న నాటి నుంచి ఇప్పటి వరకూ ఆయన దాదాపు 15సార్లు పెరోల్‌పై వచ్చారని నివేదికలు తెలుపుతున్నాయి. 2025లో జనవరి, ఫిబ్రవరి, ఏప్రిల్, ఆగస్టు నెలలలో ,2024లో మూడు సార్లు ఫెరోల్‌పై బయిటకి వచ్చినట్లు పేర్కొన్నాయి. ఢిల్లీ, హర్యాణా, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు కొద్దిరోజుల ముందు డేరాబాబా ఫెరోల్‌పై బయిటకు వచ్చారు. 2002లో జరిగిన జర్నలిస్టు హత్య కేసులో సైతం డేరాబాబా నేరారోపణలు ఎదుర్కొంటున్నారు.

## లాలూ ప్రసాద్ యాదవ్ పిటిషన్‌పై సీబీఐకి నోటీసులు

హైదరాబాద్: కుంభకోణంలో ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ పిటిషన్‌పై స్పందన తెలియజేయాల్సిందిగా ఢిల్లీ హైకోర్టు సోమవారం సిబిఐని ఆదేశించింది. అయితే ఈ దశలో విచారణను నిలిపివేయలేమని జస్టిస్ సూర్యకాంత శర్మ వ్యాఖ్యానించారు. కేసులో సిబిఐ వివరణను పరిశీలించకుండా ఆదేశాలు తీసుకోలేమని పేర్కొన్నారు. సిబిఐకి నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను జనవరి 14కి వాయిదా వేసింది. గతేడాది అక్టోబర్ 13న ట్రయల్ కోర్టు లాలూ ప్రసాద్ యాదవ్ ఆయన భార్య రబ్రీదేవి, కుమారుడు తేజస్వీ యాదవ్ సహా మరో 11మందిపై ఐపిసి కింద మోసం, నేరపూరిత కుట్ర మరియు అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద అభియోగాలను మోపింది.




# ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ సర్కార్‌కు షాక్

ఢిల్లీ: ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలింది. మాజీ మంత్రి హరీష్‌రావు పాత్రను విచారించేందుకు అనుమతించాలన్న అభ్యర్థనను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. బీఆర్ఎస్ హయాంలో హరీష్ రావు ఆదేశాలతో పోలీసు ఉన్నతాధికారి రాధా కిషన్ రావు తన ఫోన్ టాప్ చేశారని రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ గతంలో పంజాగుట్ట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు కాగా.. దానిని కొట్టేయాలని హరీష్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. ఆ ఎఫ్ఐఆర్‌ను కొట్టేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ వెంటనే..

హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం సవాల్ చేయగా.. సుప్రీం పిటిషన్ ఆ పిటిషన్‌ను కొట్టేసింది. అయితే హరీష్‌రావుపై ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయడం సరికాదంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో మరోసారి స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్‌రావు పాత్రపై తమకు ఆధారాలు లభించాయని, ఆయన బెదిరింపులకు పాల్పడ్డారని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ లాయర్ సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపించారు. అయితే.. సుప్రీం కోర్టు ఇదివరకే ఇచ్చిన తీర్పులో జోక్యానికి జస్టిస్ బీవీ నాగరత్న నిరాకరించారు. సోమవారం తెలంగాణ ప్రభుత్వ పిటిషన్‌ను ఆమె కొట్టేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు ఊరట

నవీన్‌రావును కలవనున్న హరీష్!

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ బృందం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌రావును సుదీర్ఘంగా విచారించిన సంగతి తెలిసిందే. సుమారు 9 గంటల పాటు సాగిన విచారణలో గతంలో బీఆర్ఎస్ పార్టీకి సమకూరిన ఎలక్టోరల్ బాండ్ల అంశం, ఆ పార్టీ నేతలతో ఉన్న ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నించినట్లు తెలుస్తోంది. నవీన్‌రావు వాంగ్మూలం ఆధారంగా కీలక వ్యక్తులను విచారించే అవకాశమున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇవాళ నవీన్‌రావుతో హరీష్‌రావు భేటీ అవుతారని, విచారణ వివరాలను అడిగి తెలుసుకుంటారని తెలుస్తోంది.

భారత శక్తి

# ఇండోర్ ఘటన కనువిప్పుకావాలి

ఏమాత్రం ఆలోచన ఉన్నవారైనా సరే, మంచినీళ్ల పైప్‌లైన్ మీద మరుగుదొడ్డి కడతారా? ఇంటింటికీ సరఫరా అయ్యే నీటిలో మురుగు నీరు వచ్చిన కలుస్తుంటే అధికారులు ఏం చేస్తున్నట్లు? అలా కట్టిన మరుగుదొడ్డి గుంత నుంచి పెల్లుబికిన వ్యర్థ జలాలు, ఆ టాయిలెట్ కింద నుంచి వెళ్తున్న ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌లో కలవడంతో ఇండోర్‌లో విషాదాన్ని మిగిల్చింది. జీవితాన్ని సంతోషంగా గడపాలంటే ముందు ఆరోగ్యం బాగుం డాలి. ఊరికే జబ్బు పడకూడదంటే జనావాసాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా ఉండడంతో పాటు ప్రతిఒక్కరూ సురక్షితమైన తాగునీటికి నోచుకోవాలి. ఈ రెండు కరువైన చోట రోగాలు విజృంభించి అకా ల మరణాలకు మూలమవుతాయి. మన దేశంలో చాలా మందికి కనీసం మంచినీరు అందించలేని పరిస్థితుల్లో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఉండడం ఆలోచించాల్సిన విషయం. ఒక పక్క భారత్ త్వరలో ప్రపంచంలోనే అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుంది అని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ సరైన తాగునీటి కోసం కొట్లాడుతున్న పరిస్థితి కానీ, తాగునీటికి సరైన వసతి లేని గ్రామాలు, పట్టణా లు ఇప్పటికీ దేశంలో చాలానే ఉన్నాయి. దేశంలో దాదాపు ప్రతీ ఏటా 37.7 మిలియన్ల మంది నీటి సంబంధించిన వ్యాధు లతో కాలగర్భంలో కలిసిపోతున్నట్లు తెలుస్తోంది. సగటున దేశంలో రోజూ 585 మంది కలుషిత నీరు తాగడం వలన, నీటి సంబంధించిన వ్యాధులతో మరణిస్తున్నారు అని పలు నివేదికలు పేర్కొంటు న్నాయి. ఇటీవల కాలంలో మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో వరుసగా కలుషిత నీటి ఉదంతాలు చోటుచేసుకోగా తాజాగా స్వచ్ఛ నగరంగా పేరు పొందిన ఇండోర్‌లోని భగీరథ్‌పుర ప్రాంతంలో కలుషిత నీరు తాగడం వల్ల సుమారు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది.

ప్రజల ప్రాణాలకు కలుషిత వ్యర్థాలతో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలేదనని గుర్తు చేస్తూ ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ 2010లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలను మానవ హక్కుల్లో అంతర్భాగంగా గుర్తించింది. కానీ నిర్లక్ష్యంలో తేలియాడుతున్న అధికార యంత్రాంగం కారణంగా వ్యక్తిగత, గృహావసరాలకు తగినంత మంచినీటిని నిరం తరం పొందే హక్కు జన భారతానికి ఉన్నా లేనట్లుగానే అనిపిస్తున్నది.

వరుసగా ఎనిమిదేళ్లపాటు దేశంలోనే శుభ్రమైన నగరంగా పురస్కారాలు పొందిన ఇండోర్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే.. చెత్త, మురుగునీటికి ఆవాసాలుగా పేరు పడ్డ హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, తిరుపతి, తదితర నగరాల పరిస్థితి ఏమిటనేది ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. ఏటా 3.77 కోట్ల మంది భారతీయులు కలుషిత నీళ్లలో నుంచి పురుడు పోసుకునే జబ్బుల బారినపడుతున్నారు. 15 లక్షల మంది పిల్లలు డయేరియాతో చనిపోతున్నారు. జల కాలుష్యంతో ప్రజల అనారోగ్యం దెబ్బతింటుండడంతో దేశం ఏడాదికి 7.3 కోట్ల పనిదినాలను నష్టపోతుంది. దానివల్ల భారత్‌కు సంవత్సరానికి 60 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం సంభవిస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ నేటికీ అందరికీ కనీసం విద్య, వైద్యం అందుబాటులో లేదు. అక్షరాస్యత అంతంత మాత్రంగానే ఉంది. ఇక మహిళల్లో బహు తక్కువ అక్షరాస్యత ఉన్న మాట వాస్తవం. దేశంలో చాలా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ ‘లిక్కర్ కిక్’ పైనే ఆధారపడి ఉండడం చాలా దురదృష్టకరమైన విషయం. ఏ ప్రభుత్వాలైన ఆ రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరుకోవాలి. కానీ మన ప్రభుత్వాలు ముఖ్యంగా పండగ వేళల్లో, ప్రత్యేక రోజుల్లో మద్యం ఎక్కువగా ఉత్పత్తి చేయడంతో పాటు ఆ మద్యాన్ని బాగా సేవించి, ప్రభుత్వాలకు ఆదాయం పెరగడానికి వీలుగా టైం పొడిగింపు ద్వారా ఎక్కువ మంది తాగుబోతులును తయారు చేసే ప్రయత్నం జరుగుతున్నది. తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలి. దేశం అభివృద్ధి, ఔన్నత్యం ఆ దేశ ప్రజల నైపుణ్యాలపైన ఆధారపడి ఉంటుంది.. ఉత్పత్తి రంగంలో, సేవా రం గాల్లో ప్రజలు పాలుపంచుకోవడం ద్వారా దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుంది... మన పాలకులు కలలు కంటున్న వికసిత్ భారత్ సాధ్యం కావాలంటే, ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చుకోవడానికి అవసరమైన విద్యను అందించాలి.. వైద్య రంగా న్ని బలోపేతం చేయడానికి సన్నాహాలు చేయాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. వలసలు తగ్గించాలి.. ఓటు బ్యాంకు రాజకీయాలు మానాలి. ఎప్పుడూ ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత, సంక్షేమ పథకాలుపై ఆధారపడి బతికే జీవితాల నుంచి బయట పడేందుకు చర్యలు చేపట్టాలి. ఆ విధంగా ప్రభుత్వాలు ప్రజల జీవన స్థాయి మెరుగు పరిచే ఆశయాలను రూపొందించుకుని, ప్రతీ నూతన సంవత్సరం నూతన విధానాలు ద్వారా ప్రజల తలసరి ఆదాయం పెరగడానికి కొత్త కొత్త ప్రాజెక్టులు రూపొందించి వాటిని అమలు చేయాలి. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే కలుషిత వ్యర్థాలకు చెక్ పెట్టే ప్రయత్నం జరగాలి. అదే సమయంలో ప్రజలు కూడా ప్రభుత్వాలు ఎలా పనిచేస్తున్నా యో, ఏ లక్ష్యం కోసం తహతహలాడుతున్నారో అర్థం చేసుకోవాలి. ప్రఖ్యాత రష్యా నాయకుడు లెనిన్ చెప్పినట్లు ‘పాలకుల వ్యూహాలు గ్రహించలేనంత వరకు ప్రజలు మోసపోతూనే ఉంటారు’ అనే విషయం ఇకనైనా మన ప్రజలు అర్థం చేసుకోవాలి. ప్రజలను రకరకాల కార్యక్రమాలు ద్వారా మభ్యపెడుతున్న ప్రభుత్వాలకు తగిన రీతి లో ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలి. నేటి పాలకులకు, ప్రభుత్వాలకు తగిన రీతిలో ప్రజలు గుణపాఠం నేర్పడమే మన గురుతర బాధ్యత అని ప్రజలు, జెన్ జెడ్ యువ త గ్రహించాలి.

# రూపాయిలో పావలా ఆంధ్రకే



విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

ఏపీ ప్రభుత్వం పనితీరు ప్రస్తావన జాతీయస్థాయిలో మరోసారి చర్చకు వచ్చింది. పెట్టుబడులను ఆకర్షించడంలో ముందు వరుసలో నిలిచిన ఏపీ జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ప్రపంచంలోనే ప్రముఖ మేగజైన్ ఫోర్బ్స్ తన బిజినెస్ ఎడిషన్ లో దీనిని ప్రచురించింది. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏపీ పెట్టుబడులను ఆకర్షించింది. 2025 ఏప్రిల్ - డిసెంబర్ వరకు భారతదేశ వ్యాప్తంగా వచ్చిన పెట్టుబడుల్లో పావలా శాతం ఏపీనే రాబట్టుకుందంటే ఏ స్థాయిలో వృద్ధి సాధించిందో అర్థం చేసుకోవచ్చు. ఈ మేరకు ఫోర్బ్స్ బిజినెస్ మ్యాగజైన్ ప్రత్యేక కథనం ప్రచురించడం విశేషం. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకనామిక్ డేటా ఆధారంగా ఈ కథనం ఉ ంది. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక పెట్టుబడులకు అనువైన ప్రాంతం కాదు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలు పరిశ్రమలు పెట్టేందుకు అనుకూలమైనవిగా భావిస్తారు పారిశ్రామికవేత్తలు. ఆపై పెద్ద రాష్ట్రం గా ఉత్తరప్రదేశ్ ఉంది. కానీ ఏపీ ప్రభుత్వం రాయితీలు కల్పించడం, పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇవ్వడంతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నిరంతరం పెట్టుబడుల కోసం అన్వేషిస్తున్నారు.. విదేశాలకు వెళ్లి పారిశ్రామికవేత్తలను కలిశారు. దావోస్ ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు హాజరయ్యారు. విశాఖలో ప్రభుత్వమే నేరుగా పెట్టుబడుల సదస్సు నిర్వహించింది. ఇవన్నీ సత్ఫలితాలు ఇవ్వడంతోనే ఏపీ ఈ ఘనత సాధించింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా రూ. 26.6 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు జరిగాయి. ఇందులో 25.3% వాటాను ఏపీ దక్కించుకుంది. తరువాత స్థానంలో ఒడిస్సా 13.1% పెట్టుబడులను ఆకర్షించగలిగింది. దేశానికి ఆర్థిక రాజధానిగా ఉ న్న ముంబై మహారాష్ట్ర 12.8% పెట్టుబడులను దక్కించుకుంది. దేశం మొత్తానికి వచ్చిన పెట్టుబడుల్లో సగానికి పైగా అంటే 51.2% వాటాలను ఈ మూడు రాష్ట్రాలే ఆకర్షించాయి. అందులో 25% వాటా ఏపీకే రావడం గమనార్హం. దీనిపై ఏపీ సీఎం చంద్రబాబుస్పందించారు. పెట్టుబడుల విషయంలో ఏపీ అగ్రస్థానంలో నిలవడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. మంత్రి నారా లోకేష్ సైతం హర్షం వ్యక్తం చేశారు. ఆ ఇద్దరు ప్రయత్నాలతోనే ఏపీ ఈ ఘనత సాధించిందని ఎక్కువమంది అభిప్రాయపడుతున్నారు. వైసిపి హయాంలో పరిశ్రమలు రాలేదన్న విమర్శ ఉంది. ఉన్న పరిశ్రమలను వెళ్ళగొట్టారు అన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి తరుణంలో కూటమి చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలు ఇచ్చినట్లు కనిపిస్తున్నాయి. మొత్తానికి రాజకీయంగా కూడా కూటమి ప్రభుత్వానికి ఇది గొప్ప అంశంగానే చెప్పవచ్చు.

# కొణతాల... ఎందుకిలా...

విశాఖపట్టణం, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

జనసేన నేత కొణతాల రామకృష్ణ పదవిలో లేనప్పుడు ఉ త్తరాంధ్ర సమస్యలపై ఉద్యమించేవారు. నిత్యం జనం నోళ్లలో నానేవారు. కొణతాల దాదాపు దశాబ్దకాలం పైగానే ఎలాంటి పదవి లేకున్నా నిత్యం జనంలో ఉండేవారు. కానీ ఎమ్మెల్యే అయిన తర్వాత పూర్తిగా మౌనాన్ని ఆశ్రయించారు. కొణతాల రామకృష్ణ కు నిజాయితీపరుడని పేరుంది. ఆయన రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చలేదు. పార్టీలు మారారన్న విమర్శలు తప్పించి ఆయనపై ఎలాంటి కళంకం పడలేదు. ఉత్తరాంధ్రలో సీనియర్, సిన్సియర్ నేతగా కొణతాల రామకృష్ణకు పేరుంది. అలాంటి కొణతాల రామకృష్ణ మొన్నటి ఎన్నికల్లో జనసేన నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత మాత్రం పెద్దగా ఉత్తరాంధ్ర సమస్యలపై స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉత్తరాంధ్రలో సీనియర్ నేత కొణతాల రామకృష్ణ దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి రాజకీయాల్లో ఉన్నారు. మచ్చలేని నేతగా గుర్తింపు ఉ ంది. వివాదాలకు దూరంగా ఉంటారు. కేవలం ఉత్తరాంధ్రకే పరిమితమై ఆ ప్రాంత సమస్యలనే ఎక్కువగా పట్టించుకుంటారు. నాలుగు దశాబ్దాల నుంచి రాజకీయాల్లో ఉన్నా ఆయన గెలిచింది మాత్రం మూడు సార్లు మాత్రమే. 1989, 1991 లో కాంగ్రెస్ నుంచి అనకాపల్లి పార్లమెంటుకు పోటీ చేసి విజయం సాధించారు. 2004లో అనకాపల్లి శాసనసభ నియోజకవర్గం నుంచి మరొకసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. తిరిగి 2024 ఎన్నికల్లో ఆయన మరోసారి అనకాపల్లి నుంచి విజయం సాధించారు. కొణతాల రామకృష్ణ రాజకీయ జీవితంలో గెలుపు కంటే ఓటములే ఎక్కువ. కాంగ్రెస్, వైసీపీలో చేరి బయటకు వచ్చిన కొణతాల రామకృష్ణ జనసేనలో చేరారు. 2023 ఎన్నిలకు ముందు కొణతాల రామకృష్ణ జనసేన పార్టీలో చేరారు. అనకాపల్లి శాసనసభ సీటును సాధించుకున్నారు. మంత్రి పదవి దక్కకపోవడంతో తీవ్ర నిరాశకు గురయినా తన పని తాను



చేసుకుపోతున్నారు. కొణతాల రామకృష్ణ పూర్తిగా తన నియోజకవర్గానికే పరిమితమయ్యారు. వైఎస్ మంత్రివర్గంలో పనిచేసిన కొణతాల రామకృష్ణ తనకు అదృష్టం మరోసారి వరిస్తుందని భావించినా దక్కలేదు. అయితే కొణతాల రామకృష్ణ మాత్రం ఎమ్మెల్యే అయిన తర్వాత ఆయనపై ఉన్న నమ్మకం ప్రజల్లో సన్నగిల్లుతుందని అంటున్నారు. ఉత్తరాంధ్రలో పేరుకపోయిన సమస్యలను ప్రస్తావించకుండా కొణతాల రామకృష్ణ తప్పించుకుతిరుగుతున్నారన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. మరి కొణతాల రామకృష్ణ ఎందుకు ఇలా మారిపోయారన్నది ఆయన అనుచరులకు కూడా అర్థం కాకుండా ఉంది.

## ఆ నియోజకవర్గాల్లో ఫోకస్

విజయవాడ,,భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

వైసీపీ అధినేత వైఎస్ జగన్ త్వరలో కొన్ని జిల్లాల్లో పర్యటించాలని నిర్ణయించారని తెలిసింది. ముఖ్యంగా 2024 ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలయిన తర్వాత వైసీపీని వీడి వెళ్లిన నియోజకవర్గాల్లో ఆయన పర్యటించే అవకాశాలున్నాయి. ఇందుకోసం తేదీలు ఖరారు చేయాలని పార్టీ సీనియర్ నేతలను జగన్ ఆదేశించినట్లు తెలిసింది. ముఖ్యంగా 2024 లో ఓటమి తర్వాత కీలక నేతలు పార్టీని వీడారు. అందుకోసం తొలుత ఆ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారని తెలిసింది. ముందుగా ఎక్కడి నుంచి జగన్ తన నియోజకవర్గాల పర్యటన ప్రారంభిస్తారన్నది త్వరలోనే పార్టీ నేతలు అధికారికంగా ప్రకటించే అవకాశముందని సమాచారం. తొలిదశలో పార్టీ మారిన నియోజకవర్గాలతో పాటు రెండో విడతలో అక్రమంగా కేసులు బనాయించి జైలు శిక్ష అనుభవించి వచ్చిన వైసీపీ నేతల నియోజకవర్గాలకు జగన్ వెళ్లే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఇందుకోసం తేదీలను ఖరారు చేయాలని కోరినట్లు తెలిసింది. ముందుగా జగ్గయ్య పేట నుంచి జగన్ పర్యటన ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిసింది. జగ్గయ్య పేట నియోజకవర్గం నుంచి సామినేని ఉ దయ భాను పార్టీ మారిన నేపథ్యంలో అక్కడి నుంచి ఆయన తన పర్యటన ప్రారంభిస్తారంటున్నారు. తర్వాత పొన్నూరు నియోజకవర్గానికి, ఆ తర్వాత ఒంగోలు నియోజకవర్గాన్ని పర్యటించాలని నిర్ణయించినట్లు సమాచారం. అలాగే ఏలూరు, భీమవరం నియోజకవర్గాల్లో కూడా జగన్ పర్యటించే ఛాన్స్ ఉ ంది. తర్వాత అక్రమంగా కేసులు ఎదుర్కొన్న నేతలకు చెందిన నియోజకవర్గాల్లో జగన్ రెండో విడత పర్యటించాలని ప్లాన్ చేస్తున్నారు. ఇందులో భాగంగా మైలవరం నియోజకవర్గంలో పర్యటిస్తారంటున్నారు. అలాగే గన్నవరం నియోజకవర్గంలోనూ సభ పెట్టాలని యోచిస్తున్నారు. దీంతో పాటు సర్వే పల్లి నియోజకవర్గానికి ఆయన వెళతారని తెలిసింది.

# 50 నియోజకవర్గాల్లో హైకమాండ్‌కు ట్రబుల్స్



విజయవాడ,, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

వైసీపీలో డిఫరెంట్ సినారియో. కొందరు లీడర్లు సైలెంట్ మోడ్‌లో ఉంటే.. మరికొందరు ఇప్పటి నుంచే టికెట్ రేసులో రచ్చకెక్కుతున్నారు. డబుల్స్‌తో.. వైసీపీ హైకమాండ్‌కు ట్రబుల్స్ తప్పట్లేదు. ఈ సమస్య పెద్దగానే ఉంది.. ఒకే నియోజకవర్గంలో ఇద్దరు, ముగ్గురు నేతల మధ్య పోటీ క్యాడర్‌ను అయోమయంలో పడేస్తుంది. ఒక్కటి కాదు రెండు కాదు ఏకంగా 50 నియోజకర్గాల కుంపట్లు.. వైసీపీ పెద్దలకు తలనొప్పిగా మారాయట. వర్గపోరుకు జగన్ ఎలా చెక్ పెట్టబోతున్నారు? నేతలకు సీట్లు ఎలా అడ్జస్ట్ చేయబోతున్నారు?గతమంతా ఓ లెక్క. 2024 నుంచి ఇంకో లెక్క అన్నట్లు ఉంది వైసీపీ పరిస్థితి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినప్పటి నుంచి ఫ్యాన్ పార్టీ డిఫరెంట్ సిచ్యువేషన్స్‌ను ఫేస్ చేస్తోంది. ఓవైపు సైలెంట్ అయిన నియోజకవర్గ ఇంచార్జ్‌లు.. మరోవైపు అయోమయంలో క్యాడర్..యాక్టీవ్‌గా లేని అధిష్టానం అన్నట్లుగా..అంతా గజిబిజి గందరగోళం అన్నట్లుగా ఉందట సీన్. ఇది చాలదన్నట్లు..అసలే ప్రతిపక్షంలో ఉన్నామంటే..చాలా నియోజకవర్గాల్లో వర్గపోరు హెడెక్‌గా మారిందట.

50 నియోజకవర్గాల్లో ఆధిపత్య పోరు..కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం ఇప్పటినుంచే టికెట్ ఫైట్ నడుస్తోంది. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు నేతలు. నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల కోసం ఓవైపు.. తాము రేసులో ఉన్నామని చెప్పుకునేందుకు నేతలు ఆరాటపడుతున్నారట. పోటాపోటీగా యాక్టివిటీ చేస్తూ..క్యాడర్‌ను డైలమాలో పడేస్తున్నారట. దాదాపు 50 నియోజకవర్గాల్లో నేతల ఆధిపత్య పోరు హైకమాండ్‌కు తలనొప్పులు తెచ్చి పెడుతోందట. 2024 ఎన్నికలకు ముందు భారీగా నియోజకవర్గ ఇంచార్జ్‌లను మార్చేశారు జగన్. ఆ మార్పులతో వైసీపీ అనుకున్న రిజల్ట్ సాధించకపోగా..వ్యతిరేక ఫలితాలు చవి చూడాల్సి వచ్చింది. ఆ మార్పులతో ఇప్పటికీ సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒకే నియోజకవర్గంలో ఇద్దరు, ముగ్గురు నేతలు పోటీ పడుతున్నారు. వారి మధ్య పోటీని కంట్రోల్ చేయడానికి డీలిమిటేషన్ అస్త్రం తీసుకొస్తున్నారు అధినేత జగన్. ఏపీలో నియోజకవర్గాల పెంపుపై ఆశావహులు చాలానే ఆశలు పెట్టుకున్నారు. ఇక వైసీపీలో అయితే ఆ లిస్ట్ చాలానే ఉంది. చాలా వరకు నియోజకవర్గాల్లో ఇద్దరు నేతలు..కొన్నిచోట్ల ముగ్గురు లీడర్లు పోటీ పడుతున్నారు. ఇంచార్జ్ ఒకరికి మాత్రమే అవకాశం ఉన్నా..మిగిలిన వాళ్లు సెకండ్ పవర్ సెంటర్‌గా తయారవుతున్నారు. దీంతో పార్టీ క్యాడర్, నియోజకవర్గ స్థాయి నుంచి మండల, గ్రామస్థాయి నేతలు ఎటూ తేల్చుకోలేని అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. లీడర్ల టికెట్ ఫైట్‌తో వైసీపీలో రాజకీయ రచ్చకు రోడ్డెక్కుతోంది. 2024 ఎన్నికలకు ముందు నియోజకవర్గాల ఇంచార్జులను పెద్ద ఎత్తున మార్పులు, చేర్పులు చేశారు జగన్. దీంతో చాలామందికి పోటీకి అవకాశం లేకుండా పోయింది. కొత్త వారికి అవకాశాలు వచ్చాయి. కొందరికి స్థాన చలనాలు కలిగాయి. అయితే ఎన్నికల్లో ఓటమితో ఇప్పుడు ఆ మార్పులే తలనొప్పిగా మారాయి. పాత కొత్త ఇంచార్జ్‌లు ఒకే నియోజకవర్గంలో రాజకీయం చేస్తున్నారు. వీరికి తోడు కొత్తగా పోటీ చేయ్యాలనుకునే వారు యాడ్ అవుతున్నారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఇంచార్జ్ కోసం ద్విముఖ త్రిముఖ పోటీ నడుస్తుంది. ఒకరు ఫిర్యాదులు, పైచేయి సాధించడం కోసం చేస్తున్న ఫీట్లు చూస్తూ పార్టీ క్యాడర్ ఎవరివైపు నడవాలో తెలియడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఇలాంటి ఫిర్యాదులు, పంచాయితీలు తాడేపల్లికి ఎక్కువగా వస్తున్నాయట. అయితే వీటిపై అధినేత జగన్ నేరుగా నేతలను పిలిపించి మాట్లాడుతున్నారట. ఎక్కడెక్కడైతే ఇద్దరు, ముగ్గురు నేతలు టికెట్ కోసం పోటీ పడుతున్నారో..వాళ్లందరిపైనా డీలిమిటేషన్ అస్త్రం వాడుతున్నారట జగన్. విభేదాలతో మొదటికే మోసం వస్తుందని.. కలిసి పని చేసి పార్టీని బలోపేతం చెయాలని కోరుతున్నారట. కొత్తగా నియోజకవర్గాలు పెరుగుతున్నాయి.. అందరికీ అవకాశాలు వస్తాయని భరోసా కల్పిస్తున్నారట జగన్. ఇప్పట్లో నియోజకవర్గ ఇంచార్జ్‌లను మార్చే ఆలోచన తనకు లేదని..విభేదాలు పెట్టుకుంటే క్యాడర్ ఇబ్బంది పడతారని లీడర్లకు దిశానిర్దేశం చేస్తున్నారట. ఇక మహిళలకు సీట్లు పెరుగుతాయని.. ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని క్లాస్ తీసుకుంటున్నారట జగన్. డీలిమిషన్ అయితే సరే కాకపోతే ఈ డబుల్స్‌తో వస్తున్న ట్రబుల్స్‌ను ఎలా డీల్ చేస్తారో చూడాలి.

# ఏపీలో స్థానిక పోరు ఇంట్రెస్టింగ్

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

తెలంగాణలో లోకల్ ఫైట్ అయిపోయింది. నెక్ట్స్ ఏపీలో స్థానిక సమరానికి సమయం ఆసన్నమైందన్న టాక్ వినిపించింది. దీంతో ఏపీలోనూ స్థానిక ఎన్నికల న్యూస్ హాట్ టాపిక్ అయింది. స్టేట్ ఈసీ రివ్యూస్ లోకల్ బాడీ పోల్స్‌పై అప్డేట్స్ కమింగ్ అప్ అన్నట్లుగా మార్చేశాయికానీ ఏపీలో పంచాయతీ పోరుకు ఇంకా టైమ్ పట్టబోతోందట.ఏపీలో స్థానిక పోరు ఇంట్రెస్టింగ్‌గా




మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతుంది. సరిగ్గా ఇదే టైమ్‌లో లోకల్ బాడీస్ గడువు కూడా దగ్గర పడుతోంది. దీంతో స్థానిక సమరంపై కూటమి సర్కార్ ఫోకస్ పెట్టిందన్న టాక్ వినిపించింది.. న్యూఇయర్ స్టార్టింగ్‌లోనే పంచాయతీ ఎలక్షన్స్‌కు వెళ్లేందుకు ప్లాన్ చేస్తోందని కూడా ప్రచారం జరిగింది.స్టేట్ ఈసీ రివ్యూలు కూడా ఏపీలో లోకల్ ఫైట్‌పై ఆసక్తిని పెంచేశాయి. కట్ చేస్తే ఏపీలో ఇప్పట్లో పంచాయతీ ఎన్నికల పోరు జరిగే అవకాశం కనిపించడం లేదంటున్నారు. గడువుకంటే ముందే పంచాయతీ ఎన్నికలు పెట్టాలని ప్రభుత్వం భావించినా, కొన్ని కారణాల వల్ల ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదట.పంచాయతీల పునర్విభజన, విలీనం పూర్తికాకపోవడం ఎన్నికల నిర్వహణకు అడ్డుగా మారిందంటున్నారు. వచ్చేనెల 2వ తేదీ నుంచి జనగణన ప్రారంభమవుతున్నందున పంచాయతీల విభజన జరగడం లేదని, దాంతో లోకల్ ఫైట్ ఆలస్యమయ్యే అవకాశం ఉందంటున్నారు.ఏపీలో పంచాయతీ పాలకవర్గాలకు 2026 ఏప్రిల్ 2వ తేదీ వరకు గడువు ఉంది. పాలకవర్గాల పదవీకాలం పూర్తయిన వరకు ఆ పంచాయతీ పరిధిలో మార్పులు, చేర్పులు చేయడం చట్టపరంగా కుదరదని చెబుతున్నారు. దీంతో జనవరిలో ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆలోచన మార్చుకుని..పంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసిన తర్వాతే ఎన్నికలు పెట్టాలని నిర్ణయానికి వచ్చిందట.ప్రభుత్వ ఆలోచనల ప్రకారం వచ్చే ఏడాది జూన్ లేదా జులై నెలల్లోనే పంచాయతీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు. వాస్తవానికి మూడు నెలలు ముందుగా అంటే జనవరిలోనే ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. రాష్ట్ర ఎన్నికల సంఘానికి సూచనలు కూడా ఇచ్చింది. స్టేట్ ఈసీ కూడా ఎన్నికల సన్నాహాలు స్పీడప్ చేసింది. జనవరిలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. అయితే కొన్ని రాజకీయ అంశాలు..మరికొన్ని టెక్నికల్ అంశాలు..పంచాయతీ పోరును లేట్ చేస్తుందన్న టాక్ వినిపిస్తోంది.ప్రభుత్వంలో పంచాయతీ పాలకవర్గాలు ఉన్నంతకాలం మార్పులు చేయరాదని చట్టం చేశారు. ప్రస్తుతం పంచాయతీల పునర్విభజనకు ఈ చట్టమే అడ్డంకిగా మారిందట. గత ఎన్నికల్లో వైసీపీ సర్పంచ్‌లను ఏకపక్షంగా గెలుచుకుంది. ఇప్పుడు కూటమి కూడా అదే స్థాయిలో విజయం సాధించాలని ప్లాన్ చేస్తోంది.ఇందుకోసం కొన్ని రాజకీయ నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి టీడీపీ, జనసేన నేతల నుంచి ప్రతిపాదనలు వెళ్లాయట. కొన్ని పంచాయతీల్లో విపక్షం బలంగా ఉండటంతో వాటిని రెండుగా విడగొట్టడం లేదా దగ్గరలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేయాలనే ప్రతిపాదన ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 150 ప్రపోజల్స్ వచ్చినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.ప్రభుత్వం చేసిన చట్టంతో న్యాయ వివాదాలు తలెత్తే అవకాశం ఉండటంతో..ఏప్రిల్ 2వరకు వెయిట్ చేయాలని ప్రభుత్వం భావిస్తోందట. అప్పటి స్టేట్ ఈసీకి కొత్త కమిషనర్ వస్తాడని..కొత్త కమిషనర్ ద్వారానే ఎన్నికలు పెట్టాలనేది కూడా ఓ ఆలోచన అంటున్నారు. ఏదేమైనా ఏపీలో పంచాయతీ పోరు జూన్ లేదా జులైలోనే జరిగే అవకాశం ఉందన్న టాక్ అయితే బలంగా వినిపిస్తోంది.


# కాంగ్రెస్‌లో వైసీపీ నేతలు..

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

ఏపీ కాంగ్రెస్ పై దృష్టి పెట్టింది అధినాయకత్వం. రాష్ట్రంలో ఎలా బలపడాలి అన్నదానిపై ఫుల్ ఫోకస్ చేసింది. దూరమైన వర్గాలను దరి చేసుకోవాలని చూస్తోంది. ముఖ్యంగా కాపు సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసినట్లు తెలుస్తోంది. జాతీయస్థాయిలో ప్రతి రాష్ట్రంలో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ పార్టీ మేధోమధనం చేస్తోంది. అందులో భాగంగా ఏపీ నుంచి కాపులకు



పగ్గాలు అందిస్తేనే కాంగ్రెస్ పార్టీ ఉనికి చాటుకోగలదని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దానికి కారణం లేకపోలేదు. రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిలకు పార్టీ పగ్గాలు అందించినా.. పెద్దగా వర్కౌట్ కాలేదు. ఆ సామాజిక వర్గంలో ఎంత మాత్రం మార్పు లేదు.ప్రస్తుతం కాపు సామాజిక వర్గంలో మెజారిటీ ప్రజలు టిడిపి కూటమి వైపు ఉన్నారు. అయితే కాపుల ఓటు బ్యాంకు ఎప్పుడు స్థిరంగా ఉండదు. పరిస్థితులకు తగ్గట్టు మారుతూ ఉంటుంది. కమ్మ సామాజిక వర్గంలో మెజారిటీ ప్రజలు టిడిపి వైపు ఉంటారు. ఎస్సీ ఎస్టీలతోపాటు బీసీలు చెరో పార్టీల వైపు ఉంటారు. ఇప్పుడు గాని కాపులను ఆకర్షిస్తే.. వచ్చే ఎన్నికల నాటికి ఉనికి చాటుకోవచ్చు అన్నది కాంగ్రెస్ ఆలోచన. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొత్తుకు ముందుకు రావచ్చు అన్నది కూడా ఒక అంచనా. ఎందుకంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లో వామపక్షాలతో పొత్తు పెట్టుకోవాలి. లేకుంటే కాంగ్రెస్ లైన్లోకి రావాలి. అది జరగాలంటే షర్మిల నాయకత్వ మార్పు కావాలి. ఆపై ఏదో ఒక సామాజిక వర్గ బలం కాంగ్రెస్కు ఉండాలి.గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన చాలామంది కాపు నేతలకు ఢిల్లీ నుంచి ఫోన్లు వస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఏపీ బాధ్యతలను అంతర్గతంగా కాంగ్రెస్ అధినాయకుల్లో ఒకరైన ప్రియాంక గాంధీ చూస్తున్నట్లు సమాచారం. ఆమె నేరుగా కొంతమంది కాపు నాయకులకు నేరుగా ఫోన్ చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినట్లు టాక్ నడుస్తోంది. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు టిడిపిలో ఉండి.. గుర్తింపు లేని నాయకులను కాంగ్రెస్ పార్టీ టార్గెట్ చేసినట్లు సమాచారం. అయితే ఇందులో



చాలామంది నేతలు కొద్దిరోజులు ఆలోచించుకుని చెబుతామని చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఒక్కొక్కరు కాకుండా.. గుంప గుత్తిగా ఒకేసారి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు కొందరు నేతలు నిర్ణయించుకున్నట్లు సమాచారం. అది కూడా రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా అడుగులు వేసేందుకు సూత్రప్రాయంగా ఒక అంగీకారానికి వచ్చినట్లు తెలుస్తోంది.అయితే కాపు నేతల్లో చరిష్మ ఉన్న వారికి పార్టీ పగ్గాలు అందించాలని భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రముఖంగా వంగవీటి మోహన్ రంగా కుమారుడు రాధాకృష్ణ పేరు వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. కానీ యాక్టివ్ గా లేరు. నామినేటెడ్ పదవి కోసం ఎదురుచూస్తున్నారని తెలుస్తోంది. అయితే కాంగ్రెస్ పార్టీలోకి వస్తే రాష్ట్ర పగ్గాలు అందిస్తామని ప్రియాంక గాంధీ నేరుగా చెప్పినట్లు సమాచారం. ఈ విషయంలో ఓ మాజీ ఎంపీ అనుసంధాన పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే కాపు నేతలు ఓ డజను మంది కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ అందుకు కొంత సమయం తీసుకోవాలని చూస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో 2029 ఎన్నికల్లో ఏపీలో పొత్తుల ద్వారా అయినా.. ఓట్లతోపాటు సీట్లు పెంచుకోవాలని చూస్తోంది కాంగ్రెస్. మరి ఆ పార్టీ ప్రయత్నాలు వర్కౌట్ అవుతాయా? లేదా? అన్నది చూడాలి.

# కమలం గూటికి ఆ ముగ్గురు...



శ్రీకాకుళం,భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

శ్రీకాకుళం జిల్లా రాజకీయాలు ఎవరికీ అంతు పట్టవు. అధికార ప్రతిపక్ష పార్టీల్లో విభేదాలు ఉన్నాయి. అధికార పార్టీలో కోల్డ్ వార్ సాగుతుండగా.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మాత్రం ప్రత్యక్షంగానే విభేదాలు ఉన్నాయి. మొన్నటి ఎన్నికల్లో ఓటమితో ఇప్పుడు బయట పడుతున్నాయి. ఆమదాలవలస లో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఇన్చార్జి బాధ్యతలనుంచి తప్పించారు. ఆయన స్థానంలో ద్వితీయ శ్రేణి నాయకుడు చింతాడ రవికుమార్ కు బాధ్యతలు కట్టబెట్టారు. కుటుంబ వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో దువ్వాడ శ్రీనివాసును పార్టీ నుంచి సస్పెన్షన్ చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్చార్జ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయలక్ష్మిని త్వరలో తప్పిస్తారని ప్రచారం నడుస్తోంది. అయితే వైసీపీ నుంచి నిరాదరణకు గురైన నేతలు ఇప్పుడు వేరే పార్టీలో చేరలేకపోతున్నారు. ఎందుకంటే కూటమి పార్టీల నుంచి వారికి ఆహ్వానం లేదువచ్చే ఎన్నికల్లో తమ్మినేని సీతారాంకు టికెట్ దక్కదన్న సంకేతాలు వస్తున్నాయి. దీంతో ఆయన పునరాలోచనలో పడ్డారు. తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘకాలం పనిచేశారు సీతారాం. కానీ ప్రజారాజ్యం పార్టీలో చేరి తర్వాత టిడిపిలోకి వచ్చారు. తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. గత మూడుసార్లు పోటీ చేసి ఒకసారి మాత్రమే గెలిచారు. అందుకే జగన్మోహన్ రెడ్డి పెద్దగా పట్టించుకోవడం లేదన్న టాక్ ఉంది. అయితే ఆయన టిడిపిలోకి వచ్చే ఛాన్స్ లేదు. జనసేన లోకి వెళ్లే ప్రయత్నం చేసిన వర్కౌట్ కాలేదు. అయితే ఇప్పుడు బిజెపిలోకి వెళ్తారన్న ప్రచారం పతాక స్థాయిలో ఉంది.జగన్మోహన్ రెడ్డి చాలామందికి అవకాశాలు ఇచ్చారు. అలా అవకాశాలు కల్పించిన నేతల్లో దువ్వాడ శ్రీనివాసు ఒకరు. సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన దువ్వాడ శ్రీనివాస్ జగన్మోహన్ రెడ్డి పార్టీ పెట్టిన వెంటనే ఆయన వెంట అడుగులు వేశారు. అందుకే దువ్వాడ శ్రీనివాస్ కు ఒకసారి ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించారు జగన్మోహన్ రెడ్డి. మూడుసార్లు ఆయన ఓడిపోయారు. అయితే ఎమ్మెల్సీ ని చేసి చట్టసభలకు పంపించారు జగన్. అయితే ఇప్పుడు వ్యక్తిగత కుటుంబ వివాదాలతో పార్టీ వేటు వేసింది. తిరిగి ఆయన చేరిక కష్టమేనని తేలిపోయింది. దీంతో ఆయన సైతం బిజెపిలో చేరుతారని ప్రచారం నడుస్తోంది. ఎందుకంటే టిడిపి తో పాటు జనసేనలో ఆయనకు అవకాశం లేనట్టే.ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయలక్ష్మి ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో ఆమె వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో ఆమె భర్త పిరియా సాయిరాజ్ పోటీ చేసి ఓటమి చవిచూశారు. అయితే మరోసారి ఆమెకు చాన్స్ లేదని తెలుస్తోంది. త్వరలో ఇచ్ఛాపురం నియోజకవర్గానికి కొత్త సమన్వయకర్త వస్తారని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే పిరియా విజయలక్ష్మి సైతం బిజెపిలో చేరడం ఖాయమని తెలుస్తోంది. అయితే ఈ ముగ్గురు ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడం గమనార్హం. అయితే బిజెపి హై కమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా లేదా అన్నది చూడాలి. ఎందుకంటే ఇక్కడ తెలుగుదేశం పార్టీ నుంచి కింజరాపు

# కనిపించని టెన్షన్‌లో పయ్యావుల...

అనంతపురం,భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దగా యాక్టివ్ గా లేరు. ఆయనకు ఆర్థిక శాఖ అప్పగించడంతో పెద్దగా బయట కనపించడం లేదు. అలాగే విపక్షాల విమర్శలపై కూడా పయ్యావుల కేశవ్ పెద్దగా స్పందించడం లేదు. తన పని తాను చేసుకుపోతున్నారు. ప్రతి నెల మొదటి తారీఖు వచ్చే సరికి రుణాలు తీసుకు వచ్చే బాధ్యతతో పాటు అనేక రకాలమైన వత్తిళ్లతో ఆయన కొంత పాలనాపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. అందుకే పయ్యావుల కేశవ్ పెద్దగా గతంలో మాదిరిగా యాక్టివ్ గా లేరని అంటున్నారు. పయ్యావుల తాను చూసే శాఖకు తాను తగిన న్యాయం చేయలేకపోతున్నానన్న ఆవేదనను కూడా సన్నిహితుల వద్ద వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.కేశవ్ తెలుగుదేశం పార్టీలో ఓ సీనియర్ లీడర్. దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలోను పార్టీలో కీలక నేతగా ఎదిగారు. అయితే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఓడిపోతుంటే పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన విజయాలు సాధిస్తూ వస్తున్నారు. పయ్యావుల పార్టీ ప్రతిపక్షంలో ఉన్న 2004, 2009 ఎన్నికల్లో మాత్రం విజయం సాధించారు ఆయన 1999, 2014లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ఓడిపోయారు. 2014లో ఓడిపోయినా ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో లేనప్పుడు పయ్యావుల కేశవ్ గొంతు బలంగా వినిపించేది. ఆయన పీఏసీ ఛైర్మన్ గా ఉండి కూడా 2019 లో తన గళాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినిపించడంలో ఎక్కడా తగ్గలేదు. 2024 లో ఆయన గెలిచి.. పార్టీ గెలవడంతో చంద్రబాబు నాయుడు కీలకమైన ఆర్థిక శాఖను పయ్యావుల కేశవ్ కు అప్పగించారు.పయ్యావుల కేశవ్ కు పద్దుల టెన్షన్ ఎక్కువగా ఉంది. ఈసారి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి సమానంగా తీసుకెళుతున్నారు. దీంతో రెండింటికీ నిధుల సర్దుబాటుకే సమయం సరిపోతుంది. ఎక్కువ సార్లు పయ్యావుల కేశవ్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులతో పాటు రుణాలకు సంబంధించిన అనుమతులు కూడా పొందాల్సి ఉంటుంది. ఒకవైపు చంద్రబాబు, లోకేశ్ లు ఢిల్లీ వెళ్లి నిధుల కోసం తిరుగుతున్నా, పయ్యావుల కేశవ్ పై ఆర్థిక మంత్రిగా బాధ్యత ఉండటంతో ఆయన ఎక్కువ టెన్షన్ పడుతున్నట్లు తెలిసింది. పయ్యావుల అధికారంలో ఉన్నప్పుడు కంటే ప్రతిపక్షంలో ఉన్నప్పుడే యాక్టివ్ గా ఉన్నారన్నది పార్టీ నేతలు సయితం అంగీకరిస్తున్న విషయం. పయ్యావుల పద్దుల టెన్షన్ ఈ టెర్మ్ అంతా కొనసాగే అవకాశముంది. అందుకే చంద్రబాబు కూడా పయ్యావుల విషయంలో చూసీచూడనట్లు వదిలేస్తున్నారని వినికిడి.



# ఏఐతో పెద్ద ఎత్తున దర్శనాలు

తిరుమల, జనవరి 5, ( తిరుమలలో శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాలు కొనసాగుతున్నాయి.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, టీటీడీ అధికారులు అన్ని రకాల దర్శనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్వదర్శనంతో పాటు, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి, వీఐపీలకు బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారు. శనివారం ఒక్కరోజే వైకుంఠ ద్వారం ద్వారా 88,662 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోవడం విశేషం.




హుండీ ద్వారా భారీగా ఆదాయం వచ్చిందని, రూ.5.05 కోట్లు సమకూరిందని అధికారులు తెలిపారు. అలాగే, 24,417 మంది భక్తులు తమ మొక్కులను తీర్చుకుంటూ తలనీలాలు సమర్పించారు. ఆదివారం సాయంత్రం నాటికి కూడా 50 వేల మందికి పైగా భక్తులు దర్శనం చేసుకున్నారు.భక్తుల సౌకర్యార్థం, టీటీడీ అధికారులు రద్దీని అంచనా వేస్తూ, అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకుంటున్నారు. సర్వదర్శనం చేసుకునే భక్తులకు కూడా త్వరగా దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవాణి, వీఐపీ దర్శనాలకు పరిమిత సంఖ్యలో భక్తులకు అవకాశం కల్పిస్తున్నారు. ఏఐ సాంకేతికతను ఉపయోగించడం ద్వారా, సర్వదర్శనం చేసుకునే భక్తులకు కూడా దర్శన సమయాన్ని తగ్గించగలిగారు. క్యూలైన్‌లో ప్రవేశించిన 12 గంటల్లోపే దర్శనం కల్పించడం అనేది భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా మారింది. ఈ నెల 8వ తేదీ వరకు ఇదే పద్ధతిలో భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించడానికి అధికారులు సమష్టిగా కృషి చేస్తున్నారని అడిషనల్ ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు.తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రణయ కలహోత్సవం వేడుకగా జరిగింది. ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి సరిగ్గా ఆరో రోజు, అధ్యయనోత్సవంలో 17వ రోజు తిరుమలలో ప్రణయ కలహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు శ్రీ మలయప్పస్వామివారు పల్లకి ఎక్కి మహాప్రదక్షిణ మార్గంలో స్వామి పుష్కరిణి వద్దకు వచ్చారు. ఇంతలో అమ్మవార్లు చెరొక పల్లకిపై అప్రదక్షిణంగా స్వామివారికి ఎదురుగా వచ్చి నిలుచున్నారు. పురాణ పఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరఫున జియ్యంగార్లు పూలచెండ్లను స్వామివారిపై మూడుసార్లు విసిరి వేసారు. స్వామివారు బెదిరినట్లుగా నటించి తానేమి తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడతారు.అనంతరం అమ్మవార్లు శాంతించి స్వామివారికి ఇరువైపులా చేరి కర్పూరహారతులు అందుకుని ఆలయానికి చేరుకున్నారు. ఆ తరువాత ఆస్థానం నిర్వహించారు. ఈ ఉత్సవంలో శ్రీ నమ్మాళ్వార్ రచించిన ఆళ్వార్ దివ్య ప్రబంధంలోని పాసురాలను నిందాస్తుతి శైలిలో అర్చకులు పారాయణం చేయడం ప్రత్యేకత. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.ప్రణయ కలహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తెలిపారు. మరోవైపు ఆరో రోజు వైకుంఠ ద్వార దర్శనాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయని చెప్పారు. 'ముఖ్యంగా ఐదోరోజు శనివారం అత్యధికంగా దాదాపు 89 వేల మందికి దర్శనం కల్పించాము. ఇందులో సర్వ దర్శనానికి విచ్చేసిన సామాన్య భక్తులకు ఏఐ టెక్నాలజీ సాయంతో క్యూలైన్లలోకి ప్రవేశించిన 12 గంటల్లోపే దర్శనం చేయించాము. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తూ ఎప్పటికప్పుడు క్యూలైన్ల నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ భక్తులు వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. జనవరి 8వ తేది వరకు ఇదేవిధంగా భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు అధికారులందరూ సమిష్టి కృషి చేస్తున్నాము' అని తెలిపారు.

# యాక్టివ్ పాలిటిక్స్‌లోకి భారతి



విజయవాడ,భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

రాజకీయ పార్టీల అధినేతలకు సొంత కుటుంబ సభ్యుల అండ ఉండాలి. ఒకరే రాజకీయం చేస్తామంటే కుదరదు. చంద్రబాబు తన కొడుకు లోకేష్ తో పాటు బావమరిది నందమూరి బాలకృష్ణను తెచ్చుకున్నారు. ఆపై బాలకృష్ణ అల్లుడు శ్రీ భరత్ కూడా ఉన్నారు. భార్య భువనేశ్వరి తో పాటు కోడలు బ్రాహ్మణి అవసరమైన పక్షంలో సాయం అందిస్తున్నారు. తమ్ముడు కుమారుడు నారా రోహిత్ కూడా అందుబాటులో ఉంటున్నారు. పవన్ కళ్యాణ్ కు అండగా అవసరమైన ప్రతి చోట మెగా ఫ్యామిలీ ఉంటుంది. ఇప్పటికే నాగబాబు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. అయితే ఒక ప్రాంతీయ పార్టీ మనుగడ సాధించాలంటే కుటుంబ సభ్యుల అండ అధినేతకు అవసరం.

అయితే ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డికి స్పష్టమైన లోటు కనిపిస్తోంది. మొన్నటి వరకు తల్లి విజయమ్మ, చెల్లెలు షర్మిల జగన్మోహన్ రెడ్డికి అండగా నిలబడేవారు. కానీ ఇప్పుడు వారిద్దరూ దూరమయ్యారుజగన్మోహన్ రెడ్డి పార్టీ ఏర్పాటు చేసినప్పుడు రాజశేఖర్ రెడ్డి కుటుంబం అంతా ఆయనకు అండగా నిలుస్తూ వచ్చింది. ఎంతలా అంటే ఆయన జైలుకు వెళ్లిన షర్మిల పాదయాత్ర చేశారు. విజయమ్మ అంతా తానై చూసుకున్నారు. కుటుంబంలో ప్రతి సభ్యుడు ఒక సైనికుడిలా పని చేశారు. 2019 ఎన్నికల వరకు అదే పరిస్థితి కొనసాగింది. కానీ ఆ కుటుంబంలో వ్యక్తిగత వివాదాలు చెలరేగాయి. విజయమ్మ పూర్తిగా రాజకీయాలకు దూరమయ్యారు. షర్మిల కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. కానీ సొంత పార్టీ ఏర్పాటు చేసే ఆలోచన ఉంది. ఇటువంటి తరుణంలో జగన్మోహన్ రెడ్డికి సొంత కుటుంబ సభ్యుల అండ అంటూ ఏమీ లేకుండా పోతోంది. నిజంగా అది ఆయనకు లోటు.సంక్రాంతి తర్వాత జిల్లాల పర్యటనకు సిద్ధపడుతున్నారు జగన్మోహన్ రెడ్డి. 25 పార్లమెంటరీ స్థానాల పరిధిలో.. వారానికి ఒక పార్లమెంట్ స్థానంలో పర్యటించాలని చూస్తున్నారు. అలా ఒక ఆరు నెలల పాటు పార్టీ శ్రేణులతో గడపాలని భావిస్తున్నారు. తరువాత పార్టీలో సమూల మార్పులు తీసుకొచ్చి.. సమర్థులైన నేతలకు ఇన్చార్జి బాధ్యతలు కట్టబెడతారు. తరువాత ప్లీనరీ ఉంటుంది. పార్టీ మేనిఫెస్టో ప్రకటన కూడా ఉంటుంది. 2027 ద్వితీయార్థంలో పాదయాత్ర మొదలు పెడతారు. అంటే క్షణం తీరికలేని షెడ్యూల్ ఆయనది. ఇటువంటి సమయంలో కుటుంబ సభ్యుల అండ చాలా అవసరం. అందుకే తన భార్య భారతి రెడ్డిని రాజకీయాల్లోకి తెస్తారని ప్రచారం జరుగుతోంది. అవసరం అనుకుంటే కుమార్తెలను సైతం తెరపైకి తెస్తారని టాక్ నడుస్తోంది. 2029 ఎన్నికల్లో సర్వశక్తులు వడ్డాల్సి ఉంటుందని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. అందుకే ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా తన భార్య భారతీ రెడ్డి సేవలను వినియోగించుకోవాలని చూస్తున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# కవితక్క... ఎందీ లెక్క

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ కు పెద్ద అడ్డుగా మారారు. కల్వకుంట్ల కవిత కారు స్పీడుకు బ్రేకులు వేస్తున్నట్లే కనిపిస్తుంది. ఒకరకంగా రాజకీయంగా కాంగ్రెస్ ను అణగదొక్కి తాము పైకి రావాలని భావిస్తున్న గులాబీ పార్టీకి ముల్లులాగా కల్వకుంట్ల కవిత తయారైందని చెప్పాలి. ఆమె ఆగ్రహం హరీశ్ రావు పైన. ఆమె కోపం సంతోష్ రావు పైన. ఆమె అసంతృప్తి కేటీఆర్ పైన. కానీ ప్రతి రోజూ కల్వకుంట్ల కవిత చేసే వ్యాఖ్యలు ఆ పార్టీని రాజకీయంగా ఇబ్బందులు పెడుతున్నాయి. సొంత పార్టీలోనే కవిత వ్యాఖ్యలను సమర్ధించే వారు అనేక మంది ఉన్నారు. తాజాగా హరీశ్ రావు పై కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు మరోసారి గులాబీ పార్టీలో కలకలం రేపుతున్నాయనే చెప్పాలి.ఒకవైపు కృష్ణా నది జలాల అంశంపైన, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపైన ప్రభుత్వ విమర్శలను తిప్పి కొట్టాలని బీఆర్ఎస్ భావిస్తుంటే దానికి కల్వకుంట్ల కవిత గండి కొడుతున్నట్లే కనపడుతుంది. హరీశ్ రావును ఒక మాట అంటే అసెంబ్లీ ని బాయ్ కాట్ చేశాడన్నారు. మరి కేసీఆర్ ని ఎన్నో మాటలు అన్నప్పుడు ఎందుకు చేయలేదని కవిత ప్రశ్నించారు. గుంట నక్క హరీశ్రావు ధనదాహం తీర్చుకోవడం కోసం పాలమూరు ప్రజల నోట్లో మట్టి కొట్టాడంటూ కల్వకుంట్ల కవిత ఆరోపించార. జూరాల నుంచి నిర్మించాల్సిన పాలమూరు?రంగారెడ్డి ప్రాజెక్టును శ్రీశైలానికి మార్చింది హరీశ్ రావే నని అన్నారు. కేవలం కాంట్రాక్టర్ల నుంచి కమిషన్లు దండుకోవడానికే ఈ మార్పు చేశాడంటూ కల్వకుంట్ల కవిత ఫైర్ అయ్యారు.సొంత రాష్ట్రం వస్తే నీళ్లు వస్తాయని, వలసలు ఆగిపోతాయని, తమ బతుకులు బాగుపడతాయని అనుకున్న



పాలమూరు ప్రజలు గుంట నక్క హరీశ్ రావు చేతుల్లో బలైపోయారంటూ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. హరీశ్ రావు ధనదాహానికి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల ప్రజలు బలైపోయారంటూ కల్వకుంట్ల కవిత అనడంతో ఇప్పుడు కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు ఊతమిచ్చినట్లయింది. అయితే కల్వకుంట్ల కవిత కు కౌంటర్ ఇచ్చే వారు ఇప్పుడు బీఆర్ఎస్ లో కనిపించడం లేదు. అలాగే హరీశ్ రావు కూడా తనపై కవిత చేస్తున్న ఆరోపణలకు కూడా సమాధానం ఇవ్వలేదు. కల్వకుంట్ల కవిత ను కంట్రోల్ కేసీఆర్ పెట్టకుంటే పార్టీ మరింత డ్యామేజ్ అవుతుందని గులాబీ పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తం కల్వకుంట్ల కవిత కారు స్పీడ్ కు బ్రేకులు వేస్తున్నారన్నది సుస్పష్టంగా తెలుస్తోంది.

# భగ్గుమన్న బంగారం...

ముంబై, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:



బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి మరోసారి గట్టి షాక్ తగిలింది. ఉన్నట్టుండి రాత్రికి రాత్రే ఇంటర్నేషనల్ మార్కెట్లో పసిడి, వెండి ధరలు ఊహించని స్థాయిలో పెరిగాయి. ఇతర అంతర్జాతీయ సంకేతాలు బాగానే ఉన్నప్పటికీ.. 2 రోజుల కిందట అమెరికా తీసుకున్న సంచలన చర్యలు రేట్లు మళ్లీ పుంజుకునేందుకు దారి తీశాయి. దీంతో జీవన కాల గరిష్టాల నుంచి కిందటి వారం పసిడి, వెండి రేట్లు భారీగా దిగి రాగా.. ఇప్పుడు మళ్లీ ఒక్కసారిగా ఎగబాకాయి. దీంతో రేట్లు ఇంకా పెరుగుతాయేమోనని ఆందోళన వ్యక్తం అవుతోంది యావత్ ప్రపంచానికి షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. వెనెజువేలాపై దాడులు జరిపి.. ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మధురోను బంధించింది. అక్కడి అధ్యక్ష భవనం నుంచి అమెరికాకు తీసుకొచ్చింది. ఇదే సమయంలో అక్కడ అమెరికా కంపెనీలు పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చేస్తాయని ప్రకటించారు. అయితే అకస్మాత్తుగా వెనెజువెలాపై ట్రంప్ సర్కార్ విరుచుకుపడటంతో యావత్ ప్రపంచమే ఆశ్చర్యపోయింది. దీంతో మరోసారి అంతర్జాతీయంగా తీవ్ర అనిశ్చితి నెలకొంది. ఇటీవల రష్యా ఉక్రెయిన్ యుద్ధం ఒక కొలిక్కి వస్తుందన్న అంచనాలతో గోల్డ్, సిల్వర్ రేట్లు కాస్త దిగి రాగా.. ఇప్పుడు అమెరికా – వెనెజువెలా సంఘర్షణతో మొదటికొచ్చింది .ఇంటర్నేషనల్ మార్కెట్లో 6 గంటల వ్యవధిలో బంగారం, వెండి రేట్లు రికార్డ్ స్థాయిలో ఎగబాకాయి. ఆదివారం రోజు ఈ ధరల్లో మార్పు ఉండదు. ఇక అర్ధరాత్రి 12 దాటిన తర్వాత రేట్లు అదే స్థాయిలో పెరుగుతూ పోయాయి. కిందటి రోజు అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 4330 డాలర్ల స్థాయిలో ఉండగా.. ఇప్పుడు అది మళ్లీ 4410 డాలర్ మార్కు దాటి దూసుకెళ్తుంది. అంటే 6 గంటల్లోనే ఏకంగా 80 డాలర్లకు పైగా పెరిగింది. స్పాట్ సిల్వర్ రేటు కూడా.. ఔన్సుకు 72 డాలర్ల స్థాయి నుంచి.. 76 డాలర్ల మార్కును తాకింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ధరల పెంపు ప్రభావం దేశీయంగా.. ఉదయం 10 గంటల తర్వాత కనిపిస్తుంది.ప్రస్తుతం మాత్రం దేశీయంగా బంగారం, వెండి రేట్లు స్థిరంగానే ఉన్నాయి. హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్స్ గోల్డ్ రేటు తులం రూ.. 1,24,500 వద్ద ఉంది. జనవరి 3న ధర తగ్గగా.. దానికి ముందు 1,2 తేదీల్లో పెరిగింది. ఇక 24 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములకు ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లో రూ. 1,35,820 వద్ద ఉంది. ఇక వెండి ధర ప్రస్తుతం కిలోకు రూ. 2.57 లక్షల వద్ద ఉంది. దీనికి ముందు జనవరి 3న రూ. 3 వేలు తగ్గగా.. జనవరి 2న రూ. 4 వేలు పెరిగింది.

# కేసీఆర్ సెంట్రిక్‌గా స్కెచ్



హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

దమ్ముంటే అసెంబ్లీకి రా. అన్ని అంశాలపై చర్చిద్దాం. ఓడగొడితే ప్రజల ముఖం చూడవా అంటూ..కేసీఆర్ ఇగోను టచ్ చేస్తున్నారు సీఎం రేవంత్. గులాబీ బాస్ మాత్రం రేవంత్ వ్యూహానికి చిక్కకుండా సభకు రాకుండానే తన సెంట్రిక్‌గానే చర్చ జరిగేలా స్కెచ్ వేశారట. దీంతో కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేలా రేవంత్ ఇంకా ప్రెజర్ పెంచుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. లేటెస్ట్‌గా ఎమ్మెల్సీ కవిత కూడా కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే అనడం హాట్ టాపిక్ అవుతోంది. సభకు రాకుండానే సార్ లైమ్‌లైట్‌లో ఉండే ప్లాన్ చేస్తున్నారా? ఏం చేసైనా కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించాలనేది రేవంత్ వ్యూహమా?మొన్నటి వరకు గులాబీ దళపతి మౌనం తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా కొనసాగింది. లేటెస్ట్‌గా సార్ మీడియా ముందుకు వచ్చారు. కృష్ణా జలాలు, పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతలపై స్ట్రాంగ్ వాయిస్ వినిపించి చర్చకు తెరలేపారు. ఆ తర్వాత అసెంబ్లీ సెషన్ స్టార్టింగ్ రోజు సభకు అటెండ్ అయి ఇంకా క్యూరియాసిటీ పెంచేశారు. అసెంబ్లీలో చర్చలో పాల్గొనేందుకు కేసీఆర్ వస్తున్నారంటూ లీకులు వచ్చాయి. కానీ శుక్రవారం జరిగిన సభకు సార్ రాలేదు. సెంబ్లీకి హాజరైన బీఆర్ఎస్ శాసనసభ్యులు కూడా తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని వాకౌట్ చేశారు.అయితే కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటూ ఎత్తుకున్న రాగాన్ని ఎంతకు వదిలి పెట్టడం లేదు సీఎం రేవంత్. పదేపదే సవాళ్లు విసురుతున్నారు. పైగా మీరు సభకు రండి..సలహాలు..సూచనలు ఇవ్వండి అంటూ పిలుపిస్తున్నారు. అంతటితో ఆగకుండా కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఆయన గౌరవానికి ఎలాంటి భంగం కలిగించబోమని హామీ ఇస్తున్నారు రేవంత్. గత సర్కార్ హయాంలో జరిగిన తప్పిదాలపై చర్చించేందుకు కేసీఆర్ సభకు రావాలని అంటున్నారు. అంతేకాదు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేలా తెలంగాణ ఉద్యమకారులు ఒత్తిడి తేవాలని కూడా రేవంత్ చెప్పుకొస్తున్నారు. మంత్రి వివేక్, ప్రభుత్వ సలహాదారు కేకే లాంటి తెలంగాణ ఉద్యమకారులు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేలా ప్రెస్‌మీట్ పెట్టాలంటూ స్వయంగా రేవంతే సూచించడం ఆసక్తికరంగా మారింది.లేటెస్ట్‌గా సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికీ ఎన్నో సార్లు కేసీఆర్‌కు సవాల్ చేశారు రేవంత్. అయినా కేసీఆర్ మాత్రం రేవంత్ సవాల్‌ను స్వీకరించి అసెంబ్లీకి రావడం లేదు. అసలు రేవంత్ పేరెత్తి మాట్లాడేందుకు సార్ ఇష్టపడట్లేదంటున్నాయి గులాబీ శ్రేణులు. రేవంత్ మాత్రం ఏం చేసైనా కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించే స్కెచ్ వేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది.గౌరవానికి భంగం కలగకుండా చూసుకుంటానని చెప్తూనే.. దమ్ముంటే అసెంబ్లీకి రా అని సవాల్ విసరడం వెనక..పెద్ద ఎత్తుగడే ఉందన్న చర్చ జరుగుతోంది. అయితే లేటెస్ట్‌గా ఎమ్మెల్సీ కవిత కూడా సీఎం రేవంత్ లాగే..కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే అంటుండటం చర్చకు దారితీస్తోంది. అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ వచ్చి సమాధానం చెప్పకపోతే బీఆర్ఎస్ పని ఖతం అంటూ కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ తప్పు చేయకపోతే సభకు రావాల్సిందే అంటున్నారు కవిత. సభకు రాకుండా పిల్ల కాకుల మీద సభా సమయాన్ని వదలొద్దంటూ హితవు పలికారు.ఇలా పార్టీ ఏదైనా..లీడర్ ఎవరైనా..అందరినోట సార్ సభకు రావాల్సిందేనన్న మాట వినిపించేలా చేయాలన్నదే రేవంత్ స్కెచ్ అంటున్నారు. ఓవైపు సీఎం రేవంత్.. కేసీఆర్ సభకు రావాలంటూ సవాళ్లతో ఇగోను టచ్ చేసే స్కెచ్ వేస్తున్నారట. ఇప్పటివరకు కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించేందుకు రేవంత్ వేసిన ఎత్తులేవి సక్సెస్ కాలేదని..అందుకే రేవంత్ కొత్త డ్రామా షురూ చేశారని గులాబీ లీడర్లు మండిపడుతున్నారు.కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటూ..తెలంగాణ ఉద్యమకారులతో ప్రెస్‌మీట్ పెట్టించి ప్రజల్లో ఓ చర్చకు తెరలేపాలనేది రేవంత్ వ్యూహమట. సరిగ్గా ఇదే టైమ్‌లో కవిత కూడా కేసీఆర్ సభకు రావాల్సిందేనంటూ మాట్లాడటం హాట్ టాపిక్ అవుతోంది. ఇలా అన్ని దిక్కుల ఒత్తిడి తెచ్చి కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించేందుకు రేవంత్ వేస్తున్న ఎత్తులు ఎప్పుడు సక్సెస్ అవుతాయో చూడాలి.

# స్థానికంగా బలపడుతోన్న కమలం

న్యూఢిల్లీ భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

భారతీయ జనతాపార్టీ.. ప్రపంచంలో అత్యధిక సభ్యంత్వం కలిగిన పార్టీ. 12 ఏళ్లుగా దేశంలో అధికారంలో ఉంది. ఉత్తరాది పార్టీగా పదేళ్ల క్రితం వరకు బీజేపీకి ముద్ర ఉండేది. కానీ తర్వాత దక్షిణాదిన కూడా పాగా వేసింది. మహారాష్ట్ర, కర్ణాటకలో అధికారంలోకి వచ్చింది. కేరళ, తెలంగాణ, తమిళనాడులో పాగా వేయాలని ప్రయత్నిస్తోంది. ఇదిలా ఉంటే.. దక్షిణాదిలో బీజేపీ అర్బన్ పార్టీగానే గుర్తింపు ఉంది. కానీ 2025 డిసెంబర్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటింది. ప్రతిపక్ష కాంగ్రెస్‌ను వెనక్కి నెట్టింది. ప్రాంతీయ పార్టీలను మించి సీట్లు గెలిచింది. దీంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలపడుతోందన్న సంకేతాలు వస్తున్నాయి. మహారాష్ట్ర, కేరళ, కర్ణాటక, గోవా, అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించింది.

మహారాష్ట్రలో..

మహారాష్ట్రలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 117 స్థానాలతో ముందంజలో నిలిచింది. మిత్ర పక్షాలు ఈక్‌నాథ్ శిండే శివసేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ కలిసి 200+ సీట్లు సాధించాయి. మహాఘట్‌బంధన్‌కు 37 మాత్రమే వచ్చాయి. ఈ మైత్రి విజయం బీజేపీ దక్షిణ, పశ్చిమ రాష్ట్రాల్లో బలపడుతుందనడానికి నిదర్శనం.

కర్ణాటకలో అధికార పార్టీకి షాక్..

కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో పట్టణ స్థానిక సంస్థల్లో బీజేపీ 40 సీట్లతో ఆధిక్యం చెప్పింది. కాంగ్రెస్ 23, జేడీఎస్ ఒకటి, స్వతంత్రులు 2 మాత్రమే గెలిచారు. అధికార పార్టీని కాదని అక్కడి ఓటర్లు బీజేపీకి స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించారు.

గోవాలో..

ఉత్తరాది రాష్ట్రం గోవాలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఇక్కడ బీజేపీ?మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ కూటమి 32 సీట్లు సాధించింది. కాంగ్రెస్ 10, ఆప్ 1, స్వతంత్రులు 4. అధికార బీజేపీ స్థానిక స్థాయిలో బలపడినట్టు నిదర్శనం.

అరుణాచల్ ప్రదేశ్..

అరుణాచల్‌లో జిల్లా కౌన్సిల్‌లో బీజేపీ 170 సీట్లు, పంచాయతీల్లో 6,085 సీట్లు గెలిచాయి. పీపీఏ 648, ఎన్‌పీపీ 160, స్వతంత్రులు 627, కాంగ్రెస్ 216 గెలిచాయి. ఈశాన్య రాష్ట్రంలో బీజేపీ ఆధిపత్యం పెరగడం గమనార్హం.

కేరళలో..

కేరళ పంచాయతీల్లో యూడీఎఫ్ 505, ఎల్‌డీఎఫ్ 345, స్వతంత్రులు 64, బీజేపీ 26 సీట్లు గెలిచాయి. తిరువనంతపురం మున్సిపాలిటీలో బీజేపీ గణనీయ పురోగతి చెందింది. గతంతో పోలిస్తే చాలా పంచాయతీల్లో బీజేపీ విజయం షాధించింది.ఈ ఎన్నికలు బీజేపీ అట్టడుగుస్థాయి బలాన్ని చూపుతున్నాయి. అధికారంలో లేని రాష్ట్రాల్లో కూడా బీజేపీ బలపడింది. 2024 లోక్‌సభ తర్వాత పార్టీ స్థానిక స్థాయిలో దృష్టి పెట్టి, దక్షిణ?ఈశాన్యంలో పట్టు పెంచుకుంది. తెలంగాణలో కూడా ఇదే ట్రెండ్ కొనసాగుతోంది.

# కేటీఆర్ నియోజకవర్గం మార్పు కోరుకుంటున్నారా..

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ పరిపాలించారు. రెండు పర్యాయాలు కూడా నాటి ముఖ్యమంత్రి కుమారుడు కేటీఆర్ కీలక శాఖలను పర్యవేక్షించారు. కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉద్యమం జరిగిన నాటి నుంచి ఇప్పటివరకు సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఆయన కొనసాగుతున్నారు.సిరిసిల్ల ప్రాంతంలో కేటీఆర్ కు బలమైన క్యాడర్ ఉంది. ఇక్కడ చేనేత కార్మికులకు ఆయన అనేక విధాలుగా ప్రభుత్వ పథకాలు అందే విధంగా కృషి చేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో లేదు. భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడిగా కేటీఆర్ కొనసాగుతున్నప్పటికీ.. ఫార్ములా ఈ కార్ రేసు లో ఆయన తీవ్రస్థాయిలో అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఆయనను ఏసీబీ విచారించింది.2023 నుంచి ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో భారత రాష్ట్ర సమితి అనుకూల ఫలితాలను సాధించలేకపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైంది. పార్లమెంటు ఎన్నికల్లో 0 ఫలితాలను సాధించింది. స్థానిక ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థానాలను కూడా సాధించలేకపోయింది. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో గులాబీ పార్టీ ఓడిపోయింది. ఇన్ని ఓటముల సమయంలో భారత రాష్ట్ర సమితికి కార్య నిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ కొనసాగారు.కేటీఆర్ భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షుడి హోదాలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక పర్యాయాలు పర్యటించారు. గతంలో సిరిసిల్ల మీద కేటీఆర్ అంత సీరియస్ గా దృష్టి పెట్టేవారు కాదు. అయితే ఇప్పుడు కేటీఆర్ సిరిసిల్ల మీద ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. పలు కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. వారం వారం నియోజకవర్గానికి వెళ్తున్నారు. గతంలో కేటీఆర్ నెలకు ఒకసారి సిరిసిల్లకు వస్తే గొప్పగానే ఉండేది. అయితే ఇప్పుడు పూర్తిగా మారిపోయింది.గడిచిన 10 సంవత్సరాల కాలంలో కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించానని చెప్పుకుంటారు. కానీ ఇప్పుడు సిరిసిల్లలో రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇటీవల స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల్లో ఆయన ఒక్కసారిగా ఆత్మ రక్షణలో పడిపోయారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.నియోజకవర్గం లో భారత




రాష్ట్ర సమితి నల్లేరు మీద నడక మాదిరిగా గెలవలేదు. అధికార పక్షానికి పోటీ మాత్రమే ఇవ్వగలిగింది. అయితే ఈ ఫలితాలు కేటీఆర్ ను ఇబ్బందికి గురి చేశాయని వార్తలు వినిపిస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు సిరిసిల్ల నియోజకవర్గం లో కేటీఆర్ కు అనుకూలంగా అన్ని జరిగిపోయాయి. ఇప్పుడు పరిస్థితి మాత్రం అలా లేదు. కార్యకర్తలు ఇతర పార్టీలవైపు వెళ్ళడానికి ఆసక్తిగా ఉన్నారు. ఈ వలసలను అడ్డుకోవడానికి.. నాయకత్వంలో భరోసా నింపడానికి కేటీఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని.. అందువల్లే ప్రజలలో ఉండాలని ఆయన భావిస్తున్నట్టు తెలుస్తోంది.అధికారం ఉన్నప్పుడు కేటీఆర్ అభివృద్ధి పై దృష్టిపెట్టారని.. అప్పట్లో ఆయన నాయకత్వం మధ్య సమన్వయం సాధించడంలో దృష్టి పెట్టలేదని.. అందువల్లే సిరిసిల్లలో గులాబీ పార్టీ నాయకుల మధ్య విభేదాలు పెరిగాయని ప్రచారంలో ఉంది. అందువల్ల కేటీఆర్ ప్రజల్లో ఉంటున్నారు. వారి మధ్య ఉన్న గ్యాప్ ను పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. రచ్చబండ లాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల ను కలిసే ప్రయత్నం చేస్తున్నారు.సిరిసిల్ల అనేది తెలంగాణ రాష్ట్రంలో ఒక నియోజకవర్గం మాత్రమే కాదు. కేటీఆర్ కు బలమైన రాజకీయ కోట. ఆ కోట ఎప్పటికీ బలంగానే ఉండాలి. అలా కాకుండా పగుళ్లు ఏర్పడితే ఇబ్బందికరమైన వాతావరణం నెలకొంటుంది. భవిష్యత్ కాలంలో కేటీఆర్ నాయకత్వాన్ని ఆ పరిణామం ఇబ్బందికి గురిచేస్తుంది. అందువల్ల ఈ నష్టాన్ని పూడ్చడానికి కేటీఆర్ ఏకంగా నియోజకవర్గంపై దృష్టి పెట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండ గడుతున్నారు .

# హైదరాబాద్‌లో ‘ట్రౌట్’ చేపల సాగు కేంద్రం

రంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

హైదరాబాద్ శివారులో రెయిన్‌బో ట్రౌట్ చేపల పెంపకానికి సరికొత్త అధ్యాయం మొదలైంది. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత ఫారమ్‌ను రేపు కేంద్ర మంత్రి ప్రారంభిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో వేడి వాతావరణంలోనూ శీతల నీటి చేపల పెంపకాన్ని ఇది సాధ్యం చేస్తుంది. గ్రామీణ యువతకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.మత్స్య పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి హైదరాబాద్ వేదికవుతోంది. సాధారణంగా హిమాలయాలు, శీతల పర్వత ప్రాంతాలకే పరిమితమైన ‘రెయిన్‌బో ట్రౌట్’ చేపలను.. ఇప్పుడు దక్షిణ భారతదేశపు ఉష్ణమండల వాతావరణంలో పెంచబోతున్నారు. దేశంలోనే మొట్టమొదటి భారీ స్థాయి రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత రెయిన్‌బో ట్రౌట్ ఫారమ్‌ను కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ రేపు (జనవరి 5) ప్రారంభించనున్నారు.రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ లిమిటెడ్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు చేపల సాగు అనేది ఆయా ప్రాంతాల వాతావరణంపై ఆధారపడి ఉండేది. కానీ ఈ ప్రాజెక్ట్ ఆ అంచనాలను తలకిందులు చేసింది. అత్యాధునిక ప్రెసిషన్ ఇంజనీరింగ్ , నీటిని నిరంతరం శుద్ధి చేసే వాటర్ రీసర్క్యులేషన్ సాంకేతికతతో హైదరాబాద్ వంటి వేడి వాతావరణంలో కూడా ఏడాది పొడవునా శీతల నీటి చేపలను పెంచవచ్చని ఈ సంస్థ నిరూపించింది. వాతావరణం కంటే సాంకేతికతే సాగుకు ప్రాధాన్యతనిస్తుందని ఈ కేంద్రం చాటిచెప్పనుందికేవలం ఉత్పత్తి కేంద్రంగానే కాకుండా పరిశోధనా సంస్థగా కూడా పనిచేయనుంది. గ్రామీణ యువతకు, విద్యార్థులకు ఆటోమేషన్, బయోసెక్యూరిటీ, ఆధునిక ఆక్వాకల్చర్ పద్ధతులపై ఇక్కడ ప్రత్యక్ష శిక్షణ ఇస్తారు. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే



కాకుండా, నూతన పారిశ్రామికవేత్తలు తయారయ్యే అవకాశం ఉంది. మత్స్య రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2015 నుండి ఇప్పటివరకు సుమారు రూ. 38,572 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా కోల్డ్ వాటర్ ఫిషరీస్‌కు అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్ వంటి రాష్ట్రాలకే పరిమితమైన ఈ సాగును ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నారు. ప్రస్తుతం ఏటా 14 లక్షల ట్రౌట్ విత్తనాల ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.మత్స్య రంగాన్ని కేవలం జీవనోపాధిగానే కాకుండా, ఒక సాంకేతిక ఆధారిత ఎగుమతి రంగంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇప్పటికే ఐటీబీపీతో ఒప్పందం చేసుకుని సరిహద్దు గ్రామాల్లో ఈ చేపల సరఫరాను ప్రోత్సహిస్తోంది. అదేవిధంగా జమ్మూ కాశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో ఫిషరీస్ క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నారు. హైదరాబాద్‌లో ప్రారంభం కానున్న ఈ సరికొత్త సాగు కేంద్రం, భవిష్యత్తులో దేశీయంగా చేపల వినియోగాన్ని పెంచడమే కాకుండా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడంలో కీలక పాత్ర పోషించనుంది.

============

# ఏసీల్లేకుండా ఫ్యూచర్ సిటీ

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. దేశానికే ఆదర్శంగా నిర్మించాలని సంకల్పించింది. తెలంగాణ విజన్ 2047లో భాగంగా దీనిని నిర్మిస్తోంది. ఇప్పటికే పనులు ప్రారంభమయ్యాయి. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఫ్యూచర్ సిటీలోనే ఎకనామిక్ సమ్మిట్ నిర్వహించారు. భారీగా పెట్టుబడులు రాబట్టారు. ఈ నేపథ్యంలో సీఎం మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏసీలు లేకుండా సిటీ నిర్మిచాలని భావిస్తున్నారు. ఏసీలకు ప్రత్యామ్నాయంగా డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టమ్ (డీసీఎస్) ప్రవేశపెడుతోంది.ఫ్యూచర్ సిటీని తెలంగాణ ప్రభుత్వం 30 వేల ఎకరాల్లో నిర్మించనుంది. రంగారెడ్డి జిల్లా మీరాఖాన్‌పేటలో ఈమేరకు పనులు జరుగుతున్నాయి. ఇందులో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ (సీబీడీ)లో ఏఐ సిటీ (300 ఎకరాలు), హెల్త్‌సిటీ (200 ఎకరాలు), ఎడ్యుకేషన్ హబ్ (500 ఎకరాలు), లైఫ్ సైన్సెస్ పార్క్ (3వేల ఎకరాలు) ఏర్పాటు. గుజరాత్ గిఫ్ట్ సిటీ, పోచంపల్లి ఇన్ఫోసిస్, ఐటీ కారిడార్ గేట్‌వేల్లో ఇప్పటికే డీసీఎస్ విజయవంతమైంది.ఏసీల ఏర్పాటుతో వాయు కాలుష్యం పెరుగుతుంది. ఇప్పటికే ప్లాస్టిక్ రహిత నగరంగా హైదరాబాద్‌ను మాచ్చడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఈ క్రమంలో ఫ్యూచర్ సిటీలోనూ కాలుష్యం లేకుండా నిర్మించడంలో భాగంగా ఏసీలు లేకుండా చేయాలని నిర్ణయించింది. ఏసీలు



వేడిని పెంచుతాయి. డీసీఎస్ ఒక సెంట్రల్ పాయింట్‌లో నీటిని చల్లబరిచి పైపుల ద్వారా భవనాలకు సరఫరా చేస్తుంది. గదులలోని ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్లు ఈ చల్లని నీటితో ఉష్ణోగ్రత తగ్గిస్తాయి. వేడెక్కిన నీరు తిరిగి ప్లాంట్‌కు వెళ్తుంది. మళ్లీ చల్లబడి పైపల ద్వారా తిరిగి వస్తుంది.డీసీఎస్‌తో 30 శాతం విద్యుత్ ఆదా అవుతుంది. పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుంది. కార్బన్ ఉద్గారాలు 25?40% వరకు తగ్గుతాయి. ఫ్యూచర్‌సిటీలో మాల్స్, టౌన్‌షిప్‌లకు ఇది అనువైన మోడల్. దీర్ఘకాలంలో నిర్మాణ ఖర్చు తక్కువ, ఆస్తి విలువలు పెరుగుతాయి. తెలంగాణలో మొదటిసారి డీసీఎస్ ఫ్యూచర్ సిటీలో అమలవుతోంది. దీంతో ఈ నగరం గ్లోబల్ స్మార్ట్ సిటీల స్థాయికి ఎదుగుతుంది.

# సీఎంవో లో షాడో లేడీ...?

హైదరాబాద్‌భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

సరిగ్గా కొద్ది రోజుల క్రితం ఇండస్ట్రీల భూములకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం హిల్ట్ పేరుతో ఒక పాలసీ తీసుకొచ్చింది. ప్రభుత్వం దీని గురించి ఇంకా అధికారికంగా ప్రకటించక ముందే..ఆ వ్యవహారం మొత్తం గులాబీ పార్టీ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఏకంగా గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు.. కేటీఆర్ హైదరాబాద్ నగరంలో ఉన్న పారిశ్రామిక వాడల్లోకి వెళ్లారు. అధికార కాంగ్రెస్ పార్టీ మీద ఎంత విషం చిమ్మాలో.. అంత చిమ్మేశారు.. దీంతో స్వయంగా ఐటీ శాఖ మంత్రి రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఆ పాలసీ గురించి తాము మాట్లాడలేదని.. చర్చల దశలో ఉన్నాయని వ్యాఖ్యానించారు.హిల్ట్ పాలసీకి సంబంధించిన వ్యవహారం గులాబీ పార్టీకి చేరడానికి ప్రధానంగా ఇద్దరు అధికారులు కారణమని ప్రభుత్వం ఆలస్యంగా గుర్తించింది. ఆ తర్వాత వారిపై వేటు వేసింది. ఈ వ్యవహారంతో సెక్రటేరియట్ లో ఏం జరుగుతోంది.. సీఎం ఓలో ఏం జరుగుతోంది అనే చర్చ మొదలైంది. ప్రభుత్వ విధానాలు రహస్యంగా ఉండాల్సిన చోట ఇలా బహిర్గతం కావడం పట్ల చాలామంది ముక్కున వేలేసుకున్నారు. ఆ ఇద్దరు అధికారుల వ్యవహార శైలి తర్వాత సీఎంఓ లో తీసుకునే నిర్ణయాలు బయటికి వెళ్ళకుండా ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది.ఇప్పుడు తెలంగాణ సీఎంఓ గురించి ఓ సంచలన కథనం ప్రసారమైంది. దీనిని రాజ్ న్యూస్ అనే ఛానల్ ప్రసారం చేసింది. తెలంగాణ సీఎం ఓలో మాధవి అనే ఒక మేడం ఉన్నారట. ఆమె ఏం చెబితే సీఎం ఓలో అది జరుగుతుందట. అంతేకాదు తిరుపతిలో ఆమెకు విఐపి ప్రోటోకాల్ కూడా ఇప్పించారట. తెలంగాణ సీఎంఓ మొత్తాన్ని ఆమె శాసిస్తున్నారట. అనుకూలమైన అధికారులకు పోస్టింగులు కూడా ఆమె ఇప్పిస్తున్నారట. దీనికోసం భారీగానే వసూలు చేస్తున్నారట. పైగా ఆమెకు ప్రభుత్వంలో కీలకమైన నాయకుడి అండదండలు ఉన్నాయట.. అందువల్లే ఆమె ఏం చేసినా సరే సీఎం ఓలో చెల్లుబాటు అవుతోందట. వాస్తవానికి ఇలాంటి విషయాలను గులాబీ పార్టీ అనుకూల మీడియా లేదా ఆ పార్టీ మౌత్ పీస్ టెలికాస్ట్ చేయాలి. కానీ ఇంత నిగూఢమైన సమాచారాన్ని గులాబీ పార్టీ అనుకూల మీడియా సంపాదించలేకపోయింది. దాని కంటే ముందుగానే రాజ్ న్యూస్ లో ఈ వార్త ప్రసారమైంది. ఇది నిజమా? అని గ్రూక్ ను అడిగితే నిరాధారం అని చెప్పింది. అయితే ఇదే రాజు న్యూస్ పేరుతో తెలంగాణ భవన్లో గులాబీ పార్టీ అనుకూల ఛానల్ ప్రసారాలు చేసేది. ఆ తర్వాత కొంతకాలానికి టీ న్యూస్ ఏర్పాటయింది. ఇప్పుడు ఇదే గులాబీ పార్టీకి రాజ్ న్యూస్ ప్రసారం చేసే కథనాలు సోషల్ మీడియాలో పోస్టింగులు అయ్యాయి. ఈ ప్రకారం చూసుకుంటే టీ న్యూస్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే విధంగా ప్రయత్నించడం లేదని అర్థమవుతోంది.

మేడమ్ సార్ మేడమ్ అంతే!

తెలంగాణ సీఎంవోలో మేడమ్ మాధవి గారి హవా

సీఎంవోలో ఆమె చెప్పిన పని జరగపోతే అంతే సంగతులు

తిరుపతిలో ఆమెకు వీఐపీ ప్రోటోకాల్ ఇప్పించింది ఎవరు?

తెలంగాణ సీఎంవో ను శాసిస్తున్న ఆ లేడీ షాడో సీఎం ఎవరు?

# మందు బాబులకు రైతు షాక్...

మెదక్, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

మెదక్ జిల్లా రైతు ఆనంద్ తన మామిడి తోటను ‘మందుబాబుల’ బారి నుంచి కాపాడుకోవడానికి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తోటలో మద్యం తాగితే 25 చెప్పుదెబ్బలు, రూ. 5,000 జరిమానా విధిస్తామని హెచ్చరిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ వినూత్న హెచ్చరిక సోషల్ మీడియాలో వైరల్ అయింది.సాధారణంగా తోటల్లోకి పక్షులు, జంతువులు రాకుండా రైతులు కాపలా కాస్తారు. కానీ మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రైతు ఆనంద్ మాత్రం ‘మందుబాబుల’ బారి నుంచి తన మామిడి తోటను కాపాడుకోవడానికి ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన తోటను మద్యం తాగే స్థావరంగా మార్చుకున్న వారిని హెచ్చరిస్తూ ఆయన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆనంద్‌కు నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కనే మామిడి తోట ఉంది. నర్సాపూర్ పట్టణంలో మద్యం కొనుగోలు చేసే కొందరు వ్యక్తులు, దారి పక్కనే ఉన్న ఈ తోటను తమ ‘బార్’గా మార్చుకున్నారు. చెట్ల నీడన కూర్చుని హాయిగా మద్యం సేవించడమే కాకుండా, వెళ్లేటప్పుడు ఖాళీ సీసాలను తోటలోనే పగలగొట్టి వెళ్తున్నారు. అలాగే తిన్న పదార్థాల వ్యర్థాలను డిస్పోజబుల్ ప్లేట్లు, గ్లాసులు తోట నిండా పడేసి అపరిశుభ్రం చేస్తున్నారు.మందుబాబులు పగలగొట్టిన గాజు ముక్కల వల్ల తోటలో పనిచేసే కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిందెలు చూడటానికి, నీళ్లు పెట్టడానికి వెళ్లే కూలీల కాళ్లకు ఈ సీసా పెంకులు గుచ్చుకుని పలుమార్లు రక్తగాయాలయ్యాయి. ఎన్నిసార్లు చెప్పినా, బతిమిలాడినా మందుబాబుల ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఆనంద్ విసిగిపోయారు. శాంతితో చెప్పినప్పుడు వినని వారికి ‘సామ దాన భేద దండోపాయాలు’ వాడాలని నిర్ణయించుకున్న ఆనంద్.. తన తోట చుట్టూ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అందులో ఆయన రాసిన మాటలు చూసి మందుబాబుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.’ఇక్కడ మామిడి చెట్లలో మద్యం తాగరాదు. తాగినచో వారికి 25 చెప్పుదెబ్బలు.. అలాగే రూ. 5,000 జరిమానా విధించబడును’ అని ఆ బ్యానర్‌లో స్పష్టంగా హెచ్చరించారు. ఈ వినూత్న హెచ్చరికను చూసిన స్థానికులు దాన్ని ఫోటో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది కాస్తా వైరల్ అయ్యింది. నెటిజన్లు ఈ రైతు ధైర్యాన్ని అభినందిస్తున్నారు. అన్నదాత ఆవేదనను అర్థం చేసుకోవాలి.. తోటలు పార్టీలకు వేదికలు కావు అంటూ పలువురు కామెంట్లు పెడుతున్నారు. మరి ఈ ఘాటు హెచ్చరిక తర్వాతైనా మందుబాబులు తమ పద్ధతి మార్చుకుంటారో లేదో వేచి చూడాలి

==============

# మార్కెట్‌ను ముంచెత్తుతున్న నకిలీలలు

మహబూబ్ నగర్,భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

మార్కెట్లో కల్తీ వంట నూనె విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అత్యుత్తమ బ్రాండ్ల పేరుతో మార్కెట్లోకి వస్తున్న వంట నూనెలను ప్రజలు వినియోగిస్తూ అస్వస్థతను కొనితెచ్చుకుం టున్నారు. సాధారణ పప్పులు, ఇతర పదార్థాలతో పాటు వంట నూనెలను కూడా కల్తీ చేస్తున్నారు. గజ్వేల్ ప్రాంతంలో ఏళ్ల తరబడిగా ప్రముఖ బ్రాండ్లకు చెందిన వంట నూనెలను కల్తీ చేస్తూ వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. అధిక లాభాలను ఆర్జించడానికి నూనెలలో ఇతర నూనెలు పదార్థాలు కలుపుతూ కల్తీ చేయడమే కాకుండా ప్రముఖ కంపెనీల కవర్లను ముద్రించి వాటి ద్వారా కల్తీ వంట నూనెలను విక్రయిస్తున్నారు.ముఖ్యంగా ఓ ప్రముఖ కంపెనీ పేరుతో ప్రచారంలో ఉన్న పొద్దు తిరుగుడు విత్తనాలతో తయారు చేసిన వంట నూనెలను పత్తి గింజల నూనెతో కలిపి విక్రయిస్తున్నారు. ఈ కల్తీ నూనెను సాధారణంగా వంటలకు విక్రయించిన సమయంలో ఎలాంటి తేడా కనిపించడం లేదు. మాంసాహారం కానీ, తిను బండారాలు కానీ ఎక్కువగా వేయించినప్పుడు ఆ పదార్థాలు, నూనె కూడా పత్తి గింజల నూనె మాదిరిగా వాసన వస్తున్నాయి. కొనుగోలుదారులు కిరాణా దుకాణం యజమానులను అడిగిన సందర్భంలో డీలర్ ను సంప్రదించాలని సూచిస్తున్నారు.సంబంధిత డీలర్లు మాకు ఎలాంటి సంబంధం లేదంటూ, నూనె ప్యాకెట్లపై ఉండే కంపెనీ అడ్రస్ ను సంప్రదించాలని సూచిస్తూ చేతులెత్తేస్తున్నారు. సదరు కంపెనీ వంటనూనె పత్తి గింజల నూనె మాదిరిగా వాసన వస్తుందని డీలర్ ని వివరణ కోరగా పత్తి గింజల నూనె కలపడానికి ప్రభుత్వాలే అనుమతులు ఇస్తున్నట్లు వెల్లడించడం గమనార్హం. వంటనూనె ( పొద్దు తిరుగుడు గింజల నూనె) కల్తీ విషయంలో జిల్లా స్థాయి ఫుడ్ సేఫ్టీ అధికారులు అందుబాటులో లేకపోవడంతో పూర్వ అధికారులను సంప్రదించగా అసలు విషయం బయట పెట్టారు. వేర్వేరు గింజల నూనెను కలిపి వంట నూనెగా విక్రయించడానికి ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వదని వారు వెల్లడించారు. ప్రతి వంటనూనె ప్యాకెట్లపై ఏయే పదార్థాలు వంట నూనె తయారీకి వినియోగిస్తారో వివరాలు రాసి ఉంటాయని చెప్పారు.అంటే డీలర్లు కూడా ఈ విషయంలో వాస్తవాలను దాచిపెడుతున్నట్లు అధికారుల మాటల ద్వారా తేటతెల్లం అవుతుంది. గజ్వేల్ ప్రాంత అధికారులతో పాటు, జిల్లా స్థాయి అధికారులు సైతం మామూళ్ల మత్తులో తనిఖీలు చేపట్టకపోవడంతో కల్తీ వంట నూనెను వినియోగిస్తూ ప్రజలు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ప్రముఖ కంపెనీ వంటనూనె కల్తీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

========================

# ముందుకు సాగని ఆయిల్ పామ్...

కరీంనగర్ భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:



రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధి కోసం కేటాయించిన ఫ్యాక్టరీ జోన్లలో ఒప్పంద నిబంధనల ప్రకారం పురోగతి సాధించని కంపెనీలపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పురోగతి లేని ఆయిల్ పామ్ కంపెనీల ఫ్యాక్టరీ జోన్లను తగ్గిస్తూ, ఆయా ప్రాంతాలను తెలంగాణ ఆయిల్ ఫెడ్‌కు కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఆయిల్ పామ్ (ఉత్పత్తి, ప్రాసెసింగ్‌ని యంత్రణ) చట్టం, 1993, నిబంధనలు- 2008 ప్రకారం, ఆయిల్ పామ్ కంపెనీలు రైతు నాట్ల నుంచి 36 నెలల్లోపు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి, ఫ్యాక్టరీ జోన్ పరిధిలో రైతులకు సేవలు అందించాల్సి ఉంటుంది.అయితే పలు కంపెనీలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తూ, ప్రాసె సింగ్ యూనిట్ల ఏర్పాటు, నాట్ల విస్తరణ, నర్స రీ అభివృద్ధి వంటి అంశాల్లో నిర్లక్ష్యం ప్రదర్శించింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పలుమార్లు సమీక్షలు నిర్వహించినప్పటికీ ఎటువంటి పురోగతి లేకపోవడం తో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కరీంనగర్ జిల్లాలో కేటాయించిన 44,527 ఎకరాల కు 6,721 ఎకరా ల్లో మాత్రమే ఆయిల్‌పామ్ సాగులోనికి తెచ్చింది. కరీంనగర్ జిల్లాకు సంబంధించిన ఫ్యాక్టరీ జోన్‌ను రద్దు చేసి తెలంగాణ ఆయిల్ ఫెడ్‌కు కేటాయించారు.మ్యాట్రిక్స్ పామ్ ఆయిల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా లో కేటాయించిన 30,552 ఎకరాలకుగాను, కేవలం 1,606 ఎకరాలు, అదేవిధంగా కేవన్ బయోసైన్సెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు హనుమకొండలోని 9 మండలాలు, వరంగల్ జిల్లాలలోని 2 మండలాలు కలిపి 14,000 ఎకరాలు లక్ష్యం ఇవ్వగా, కేవలం 2,136 ఎకరాలనే సాగులోనికి తెచ్చారు. ఆ జిల్లాల్లో ఫ్యాక్టరీ జోన్లను పూర్తిగా రద్దు చేస్తూ, వాటిని ఆయిల్ ఫెడ్‌కు కేటాయించారు. ప్రభుత్వం పంటల మార్పిడి అవసరాన్ని తెలియజేసేలా, వంటనూనెల దిగుమతులపై ఆధారాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, ఆయిల్ పామ్ కింద రాష్ట్రంలో ఈ కార్యక్రమా న్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వ్యవసాయశాఖ సెక్రటరీ తెలిపారు.

# 1983లో భారత క్రికెట్ జట్టును విశ్వవిజేతగా తీర్చిదిద్దిన యోధుడు కపిల్ దేవ్ -నేడు ఆయన జన్మదినం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

భారత క్రికెట్ జట్టుకు ఎనలేని సేవలందించి దేశంలోనే కాదు ప్రపంచంలోనే అత్యున్నత ఆల్‌రౌండర్‌లలో ఒకడిగా పేరుసంపాదించాడుకపిల్ దేవ్ రాంలాల్ నిఖంజ్. భారతదేశపు ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడైన కపిల్ దేవ్ 1959, జనవరి 6న ఛండీగఢ్లో జన్మించారు. 2002లో విజ్డెన్ పత్రికచే 20 వ శతాబ్దపు మేటి భారతీయ క్రికెటర్‌గా గుర్తింపు పొందినాడు.సారథ్యం వహించిన ఏకైక ప్రపంచకప్ (1983) లో భారత్‌ను విశ్వవిజేతగా తీర్చిదిద్దాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి నిష్క్రమించే నాటికి అత్యధిక టెస్ట్ వికెట్లు సాధించిన బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. 1999 అక్టోబర్ నుంచి 2000 ఆగష్టు వరకు 10 మాసాల పాటు భారత జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు. సాధించిన రికార్డులు 1994, జనవరి 30న శ్రీలంకపై బెంగుళూరులో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో న్యూజీలాండుకు చెందిన రిచర్డ్ హాడ్లీ రికార్డును అధికమించి టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా అవతరించాడు. (తరువాత ఇతని రికార్డు కూడా ఛేదించబడింది)టెస్ట్ క్రికెట్‌లో 4000 పరుగులు మరియు 400 వికెట్లు డబుల్ ఫీట్ సాధించిన తొలి ఆల్‌రౌండర్‌గా రికార్డు సృష్టించాడు.1988లో జోయెల్ గార్నల్ రికార్డును అధికమించి వన్డేలలో అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా అవతరించాడు. తరువాత 1994లో పాకిస్తానుకు చెందిన వసీం అక్రం ఈ రికార్డును ఛేదించాడు.వన్డేలలో సెంచరీ సాధించిన మొట్టమొదటి భారతీయుడు.లార్డ్స్ మైదానంలో వరుసగా 4 సిక్సర్లు కొట్టి ఈ ఘనత పొందిన తొలి బ్యాట్స్‌వెన్‌గా అవతరించాడు.సాధించిన అవార్డులు1979-80 : అర్జున అవార్డు1982 : పద్మశ్రీ అవార్డు1983 : విజ్డెన్ క్రికెటర్ ఆఫ్ దొ ఇయర్ అవార్డు 1991 : పద్మవిభూషన్ అవార్డు2002 : విజ్డెన్ ఇండియన్ క్రికెటర్ ఆఫ్ ది సెంచరీ 2013టీమిండియా మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ఈ సంవత్సరానికిగానూ కల్నల్ సికె నాయుడు జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యాడు. ఈ పురస్కారంలో భాగంగా ఆయనకు ట్రోఫీ, 25 లక్షల చెక్ అంజేస్తారు. ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ ఆల్‌రౌండర్లలో ఒకడైన కపిన్ భారత్ తరపున 131 టెస్టులు ఆడి 434 వికెట్లు పడగొట్టాడు. ఇదే ఫార్మాట్లో 400 వికెట్లు, 500 పరుగులు చేసిన తొలి క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. 225 వన్డేలు ఆడిన కపిల్ 253 వికెట్లు తీసి 3783 పరుగుల సాధించాడు. ఇతని సారథ్యంలోనే భారతజట్టు 1983లో ప్రపంచ కప్ సాధించింది.

# చెత్తకుప్పలో పసికందు

రాజేంద్రనగర్ జనవరి 5,



మానవ సంబంధాలు రోజురోజుకు మంట కలిసి పోతున్నాయి. మైలర్ దేవ్ పల్లీ డివిజన్ పరిధిలోనీ బాబుల్ రెడ్డి నగర్ లో అప్పుడే పుట్టిన నెలలు నిండని పసికందును రోడ్డు పక్కన చెత్తకుప్ప వద్ద పారవేశారు. దీంతో ఆ పాప మృతి చెందింది . ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# విజయవాడలో ఐఏఎస్ అధికారి భార్య అనుమానాస్పద మృతి!

విజయవాడ భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

ఐఏఎస్ అధికారి కిశోర్ కుమార్ భార్య సత్య దీపిక మృతిఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత మొదట, అనుమానాలు లేవన్న కుటుంబ సభ్యులుసోదరి ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులుదర్యాప్తు ముమ్మరంఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి జి.కె.కిశోర్ కుమార్ భార్య సత్య దీపిక (42) విజయవాడలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కిడ్నీ సమస్య, గొంతు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆమె, ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జనవరి 3న అర్ధరాత్రి దాటాక 1:20 గంటల సమయంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై మృతురాలి సోదరి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ప్రస్తుతం ఏపీ మిషన్ ఫర్ క్లీన్ కృష్ణా, గోదావరి కెనాల్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కిషోర్ కుమార్ కుటుంబం విజయవాడ మొగల్రాజపురంలో నివసిస్తోంది. సత్య దీపికకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె డిసెంబరు 24 నుంచి 27 వరకు కిడ్నీ సమస్యకు చికిత్స తీసుకుని డిశ్చార్జ్ అయ్యారు. మళ్లీ గొంతు ఇన్ఫెక్షన్ రావడంతో డిసెంబరు 31న తిరిగి అదే ఆసుపత్రిలో చేరారు. మృతి చెందడానికి కొన్ని గంటల ముందు ఆమె తన సోదరి నరితకు ఫోన్ చేసి, మాట్లాడలేకపోతున్నానని, డిశ్చార్జ్ అయ్యాక ఇంటికి వస్తానని చెప్పారు.అయితే, ఆమె అర్ధరాత్రి హఠాత్తుగా మృతి చెందడంతో ఆసుపత్రి యాజమాన్యం దీనిని మెడికో లీగల్ కేసుగా పటమట పోలీసులకు తెలియజేసింది. మొదట కుటుంబ సభ్యులు మృతిపై ఎటువంటి అనుమానాలు వ్యక్తం చేయలేదు. పోస్ట్‌మార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే, మృతురాలి సోదరి సరిత ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పటమట సీఐ పవన్ కిశోర్ తెలిపారు.

# ఇందిర మహిళ శక్తి క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

హైదరాబాదభారత శక్తి ప్రతినిధి, జనవరి 05:



హైదరాబాద్ మధురానగర్ లోని తెలంగాణ మహిళా సహకార సంస్థ ఆవరణంలో ఏర్పాటు చేసిన జై భవాని ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ ను జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు నవీన్ యాదవ్, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఛైర్ పర్సన్ బండ్రు శోభారాణి సెమవారం ప్రారంభించారు.

# ఎమ్మెల్సీ నవీన్ రావు ఇంటికి బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్ భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

ఎమ్మెల్సీ నవీన్ రావు వెంట బి.ఆర్.ఎస్ పార్టీ ఎప్పుడు ఉంటుందని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి వెల్లడించారు. ఆదివారం ఫోన్ టాపింగ్ కేసు విషయంలో ఎమ్మెల్సీ నవీన్ రావును మూడు గంటల పాటు అధికారులు విచారించిన నేపథ్యంలోసోమవారం ఆయనకి పార్టీ తరపున సంఘీభావం తెలిపేందుకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంబిపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి సంఘీభావాన్ని తెలిపారు సందర్భాన్ని బట్టి దీనికి ప్రతి చర్య ఉంటుందని మధుసూదనాచారి వెల్లడించారు.

# రైలు ఎక్కి యువకుడు హల్చల్..

శ్రీకాకుళం భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

సోంపేట రైల్వే స్టేషన్లో, భువనేశ్వర్-తిరుపతి సూపర్ఫాస్ట్ ఎక్స్ప్రెస్ రైలు ఆగి ఉన్న సమయంలో ఓ యువకుడు రైలు ఎక్కి ప్రయాణికులను ఇబ్బంది పెట్టాడు. దిగమని కోరినా వినకుండా అతను ముప్పుతిప్పలు పెట్టడంతో, ఒక ప్రయాణికుడు పైకి ఎక్కి అతన్ని కిందకు తోసేశాడు. ప్రయాణికులు అతనికి బుద్ధి చెప్పి పోలీసులకు అప్పగించారు. రైల్వే సిబ్బంది విచారించగా, అతనికి మతిస్థిమితం లేదని గుర్తించారు.

==============================

# రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఏలూరు భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉదయం మృతి చెందాడు. ఏలూరు సత్రంపాడు ఐటిఐ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్ద ఈ ఘటన జరిగినట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడి వద్ద ఎటువంటి వివరాలు దొరకలేదు. మృతుడు ను 30 నుండి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉంటాడని, బ్లాక్ ఫాంటు గళ్ళ షర్టు ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. రైల్వే హెచ్ సి పి శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హైదరాబాద్ జనవరి 5,

మూసాపేట్ లో రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మూసాపేట ఏషియన్ లక్ష్మీ కళా థియేటర్లో మేనేజర్గా పనిచేస్తున్న వెంకటస్వామి (53) మృతి చెందాడు. ఆదివారం అర్ధరాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వస్తుండగా ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా గేదెలు రోడ్డుపైకి రావడంతో ఢీకొన్నట్లు సమాచారం. తీవ్ర గాయాలతో సమీప ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కూకట్పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. .

# కర్ణాటక సంగీత రారాజు త్యాగరాజు

## -త్యాగరాజ స్వామి 24000 కృతులు, కీర్తనలను రచించి రామార్పణం చేసిన గొప్ప వాగ్గేయకారుడు

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

త్యాగరాజు కర్ణాటక సంగీత త్రిమూర్తులలో ఒకరు. త్యాగయ్య, త్యాగబ్రహ్మ అనే పేర్లతో కూడా ప్రసిద్ధుడు. నాదోపాసన ద్వారా భగవంతుని తెలుసుకోవచ్చని నిరూపించిన వాగ్గేయకారుడు. ఆయన కీర్తనలు శ్రీరాముని పై అతనికిగల విశేష భక్తిని, వేదాలపై, ఉపనిషత్తులపై అతనుకున్న జ్ఞానాన్ని తెలియపరుస్తాయి. ఉపనయనం తరువాత తండ్రిగారి బోధలు, 18వ ఏట రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశం చేసిన రామ షడక్షరీ మంత్ర ప్రభావం, తల్లి అలవర్చిన భక్తి సంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగ రాజస్వామి వారిలో మూర్తీభవించాయి.ఇతను కర్ణాటక సంగీత త్రయంలో మరో ఇద్దరైన శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులకు సమకాలికుడు కూడా. వీరు ముగ్గురూ తమిళనాడులోని, తంజావూరు జిల్లా, తిరువారూరుకు సంబంధించిన వారే. తమిళదేశంలో పుట్టి పెరిగినా వారి గానం ఎక్కువగా తెలుగు, సంస్కృతాల్లోనే సాగింది.రామభక్తులైన శ్రీ త్యాగరాజులవారు 1767 మే 4న రామబ్రహ్మం, సీతమ్మ దంపతులకు 3 వ సంతానంగా తంజావూరు జిల్లాలోని తిరువారూరులో జన్మించారు. వీరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా, కంభం మండలంలోని కాకర్ల గ్రామానికి చెందినవారు. వారు తమిళనాడుకు వలసి వెళ్ళి తిరువారూరు లో స్థిరపడ్డారు. వారికి రామభక్తి , సంగీతం స్వతహాగా తల్లితండ్రులనుండి వచ్చాయి.తల్లి సీతమ్మ ప్రతిరోజు చేసే రామపంచాయతన పూజలో త్యాగరాజుల వారు పురందర దాస, రామదాస, అన్నమయ్య, నారాయణతీర్థ, జయదేవుల సంకీర్తనలను పాడేవారు. సంస్కృతము, తెలుగు, ఇతర శాస్త్రాలను తండ్రి వద్ద అభ్యసించారు. రామాయణ మహాభారతాలను ఆపోశన పట్టారు. 13 యేండ్ల చిరు ప్రాయంలో 'నమో నమో రాఘవాయ ' అనే కీర్తనను స్వరపరిచి ఇంటి గోడమీద రాశారు. ఇదే వారి మొదటి సంకీర్తన. త్యాగరాజుకి సంగీతం మీద వున్న శ్రద్ధను గమనించిన తండ్రి, శొంఠి వెంకట రమణయ్య గారి వద్ద సంగీతాభ్యాసానికి చేర్చారు. 'ఇంతింతై వటుడింతై' అన్నట్టు వారి సంగీత సముపార్జన దినదిన ప్రవర్ధమానమయింది. శ్రీ రామకృష్ణానంద స్వామివారు వారికి రామతారక మంత్రాన్ని ప్రసాదించారు. 96 కోట్ల రామనామ జపాన్ని త్యాగరాజ స్వామి పూర్తి చేశారు. నారదులవారు కలలో సాక్షాత్కరించగా నారద పంచరత్నాలను రచించారు.ఐహిక సుఖాలపై త్యాగరాజుల వారికి ఏ మాత్రం మక్కువ ఉండేది కాదు. నిరంతరం రామసంకీర్తనామృతంలో మునిగి తేలేవారాయన. త్యాగరాజులోని బాల మేధావిని గుర్తించి వారి గురువుగారు తంజావూరు రాజుగారికి చెప్పగా, రాజు సంతోషించి అనేక ధన, కనక, వస్తు వాహనాది




లాంఛనాలతో సభకు ఆహ్వానించాడు.కాని త్యాగరాజు నిధి చాలా సుఖమా రాముని సన్నిధి సుఖమా అనే సంకీర్తనను పాడి రాజు పంపిన కానుకలను నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. ఈ చర్యకు ఆగ్రహించిన అతని అన్నయ్యగారు జపేశుడు త్యాగరాజు నిత్యం పూజించుకొనే శ్రీ రామ పట్టాభిషేక విగ్రహాలను కావేరి నదిలో విసిరి వేశాడు. శ్రీ రామ వియోగ బాధను తట్టుకోలేని త్యాగరాజు శోకించి, దుఃఖించి ఆర్త హృదయుడయ్యాడు.కంచీపురానికి చెందిన ఉపనిషద్ బ్రహ్మేంద్రస్వామి వారి ఆదేశానుసారం తీర్థయాత్రలకు తరలి వెళ్ళారు. తిరుపతి, షోలింగపట్నం, నాగపట్నం, వలాజిపేట, శ్రీరంగం వంటి అనేక పుణ్యక్షేత్రాలను, తీర్థాలను దర్శించి ఆయా పుణ్యక్షేత్రాలలోని మూలవిరాట్ లపై భక్తిపారవశ్యం లో ఆసువుగా అనేక కీర్తనలను పాడారు. ఆ పరంపరలో లాల్గుడి పంచరత్నాలు, కోవూరు పంచరత్నాలు, తిరువత్తియార్ పంచరత్నాలు లాంటి గుచ్ఛకృతులు కూడా చేశారు. వారు రచనలను ఎప్పుడూ గ్రంధీకరించలేదు. వారి శిష్యులు వారు పాడుతూండగా వాటిని వ్రాసేవారు.వారికి ఒకనాడు కలలో రాములవారు సాక్షాత్కారమై విగ్రహాల జాడ తెలియజేశారు. ఆ విగ్రహాలను కనుగొని "కనుగొంటిని శ్రీరాముని నేడు" అని భక్తిపారవశ్యంలో ఓలలాడాడు. జానెడు పొట్టనింపుకోవడానికి ధనాపేక్ష యేల అని ఉంఛవృత్తిని స్వీకరించాడు.త్యాగరాజస్వామి కృతులలో సంగతులను వేయడం, నెరవు పద్ధతిలో కృతులను స్వరపరచడం లాంటి కొత్త ఒరవడులను సంగీత లోకానికి పరిచయం చేశారు. వారి రచనలు పండితపామర జనరంజకంగా సాగాయి. సంగీతాభ్యాసం చేసేవారి స్థాయికి తగినట్లుగా వారు రచనలు చేశారు. కొంతమేరకు సంగీత పరిజ్ఞానం వచ్చిన వారు నేర్చుకోవడానికి వీలుగా 'దివ్య నామ కీర్తనలు' , 'ఉత్సవ సంప్రదాయ కీర్తనలు' చేయగా,కొంత ప్రావీణ్యం సంపాదించిన వారికి తగ్గట్టుగా క్లిష్ట సంగతులతో కూడిన కృతులను చేశారు. దాదాపు 212 రాగాలలో వారి రచనలు సాగాయి. ఘన రాగాలలో చేసిన పంచరత్న కీర్తనలు విశ్వవిఖ్యాతం అయ్యాయి. నౌకాచరితం, ప్రహ్లాద చరిత్ర అనే రెండు గేయ నాటకాలను కూడా చేశారు.త్యాగరాజ స్వామిని వాల్మీకి అవతారంగా భావిస్తారు. వాల్మీకి 24000 శ్లోకాలతో రామాయణం రాస్తే, త్యాగరాజ స్వామి 24000 కృతులు, కీర్తనలను రచించి రామార్పణం చేశారు.

అవతార పురుషుడైన శ్రీ త్యాగరాజ స్వామి జనవరి 6 ,1847 న తిరువయ్యారు లో దివ్య సమాధి చెందారు. రామ సంకీర్తనామృతంలో సాగిన ఆ మహా పురుషుని 80 ఏళ్ళ ఆధ్యాత్మిక జీవనం భావితరాల భారతీయులందరికీ ఆదర్శప్రాయం.

# బెల్లగోడు కాలువ లో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి, దుర్వాసన నుండి ప్రజలను కాపాడండి: సిపిఐ

పోరుమామిళ్ళ (భారతశక్తి ప్రతినిధి)జనవరి 05: మల్లక త్తువా నుంచి రంగసముద్రం చెరువుకు నీరు వెళ్లే ప్రధాన బెల్లగోడు కాలువ చెత్త, పూడిక, పిచ్చి మొక్కలను తొలగించి, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల సహాయ కార్యదర్శి కోడూరు కేశవలు వారి బృందంతో బెల్లగోడు కాలువ ను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, పోరుమామిళ్ల మండలంలోని పెద్ద చెరువు నుండి మల్లకతువా ద్వారా , రంగసముద్రం చెరువుకు నీరు వెళ్లే ప్రధాన బెల్లగోడు కాలువ లో చెత్త, పిచ్చి మొక్కలు, పూడిక తీయక, రెండు వైపులా తుమ్మ చెట్లు దట్టంగా పెరిగి పంటకాలవ ఉన్నదో లేదో తెలియని పరిస్థితి గా ఉన్నది. కాలవలో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలు వలన కుళ్ళి విపరీతమైన దుర్వాసన తో చితానంద్ నగర్ నుండి, పాత ఉజ్వల స్కూల్ వరకు 12 వీధులకు చెందిన ప్రజలు ఇండ్లలోని డ్రైనేజీ నీళ్లు ఈ పంట కాలవలోకి వెళ్లాల్సిన పరిస్థితి, ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘం చైర్మన్లు, అందరికీ ఈ కాలువ గురించి తెలిసినప్పటికీ కంటికి కనపడని గుడ్డివాడిలా, చెవులకు వినబడని చెవిటి వాడిలా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉ ఒడడం చాలా బాధాకరమని అన్నారు. అలాగే గతంలో ఈ పంట కాలువకు నీళ్లు వెళ్లే సమయంలో అన్ని వీధులకు వెంబడి బట్టలు ఉతికేవాళ్లు, ప్రధానంగా రజక కుటుంబాలకు బాగా ఉ పయోగపడేది. రంగసముద్రం చెరువు నిండడం వలన, రంగసముద్రం పంట పొలాలకు, , గురప్ప గారి పల్లె, రంగసముద్రం పంచాయితీ ఉన్న ప్రతి ఇంటిలోని, వ్యవసాయ బోర్ల కు, నర్సింగ్ పల్లె గ్రామాలలో తాగునీటి సమస్య లేకుండా ఉండేది ఈరోజు ఆ పరిస్థితి లేకుండా పోయింది అందుకోసమే ఇరిగేషన్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, జిల్లా ఉ న్నతాధికారులు ఈ పంట కాలువ పూడిక తొలగించి, ప్రజలకు రోగాలను బారి నుండి కాపాడాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా అధికారులకు తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, పార్టీ సభ్యులు ప్రజాసంఘాల ప్రసాదు, శ్రీనివాసులు, యాకోబు తదితరులు పాల్గొన్నారు.



# కరెన్సీ పై గాంధీ బొమ్మ ను తొలగించే కుట్రలను తిప్పి కొట్టాలి: టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

నేషనల్ ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి లో మూడు రోజుల పాటు జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా ఆదివాసి కార్యకర్తల, నాయకుల శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ సురేష్ శెట్కార్, టీజీఐసిసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్, నేషనల్ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా శిబిరంలో పాల్గొన్న కార్యకర్తలకు ముఖ్య అధితుల చేతుల మీదుగా వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. ఆదివాసీల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన ప్రధాన ఎజెండా గా జరిగిన ఈ శిక్షణా కార్యక్రమానికి ఉమ్మడి మెదక్‌జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఆదివాసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమం లో ప్రతీ ఒక్కరూ సిన్సియర్ గా చాలా ఇష్టంగాపాల్గొన్నారన్నారు. ఇలాంటి క్యాంపు సంగారెడ్డి లో జరగడం సంతోషంగా ఉందని తెలిపారు. నారాయణఖేడ్ ప్రాంత ప్రజల కోరిక మేరకు ఆ ప్రాంతంలో ఇండస్ట్రియల్ ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగ అవకాశం కలిపిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ కన్న తల్లి లాంటి దన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయని వారు గాంధీ బొమ్మ ను తొలిగించాలని



కుట్ర చేస్తున్నారని అందరం ఏకం అయ్యి అలాంటి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇతర పార్టీలు మాటలతో సరిపెట్టుకుంటారు. ..కానీ కాంగ్రెస్ పార్టీ ఆలా కాదు... ఇచ్చిన మాటను నిలబెట్టుకొని తీరుతుంద ని వివరించారు. అదివాసీ శిక్షణలో జరిగిన చర్చలు, విషయాలను బయట చెర్చించా లని కోరారు. అనంతరం ఎంపీ సురేష్ శెట్కార్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నుండి గాంధీ పేరు ను తీసేసి కేంద్ర ప్రభుత్వం తప్పు చేసిందన్నారు. కేంద్రం చర్యలకు వ్యతిరేకం గా పార్లమెంట్ లో పోరాటంచేస్తామన్నారు. గరిబోళ్ల కు ఉపాధి కల్పించకుండా, గరిబోళ్లను పెంచే విదంగా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు.

# ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలి :జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి,భారత శక్తి, జనవరి 5:

ప్రజావాణి లో వచ్చిన సమస్యల సత్వర పరిష్కారానికి



అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకుసూచించారు . కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అడిషనల్ కలెక్టర్లుమాధురి,పాండు ,

నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతిలతో కలిసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారులు భూ సమస్యలు, ఆసరా పింఛన్లు, ఉద్యోగ కల్పన,తదితర అంశాలతో పాటు పంచాయతి, వ్యవసాయ, ఆచీూ, హౌసింగ్, లేబర్, పి డబ్ల్యూ డి, డి ఆర్ డి ఓ, మున్సిపల్, రెవెన్యూ, బి సి డి ఓ, మైన్స్, డి ఎస్ సి ఓ

తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. ఆయా వినతులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖలఅధికారులకుఆదేశించారు. ప్రజావాణి లో 42 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమమని , ఆర్జి దారుల సమస్యలను వెంట వెంటనే పరిష్క

రించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ ఏ ఓ, ప్రజలు, పాల్గొన్నారు .

# అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టరు శ్రీధర్ చెరుకూరి

వైఎస్ ఆర్ కడప,జనవరి 05(భారత శక్తి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నకు అధిక ప్రాధాన్యతనిస్తూ నిర్వహిస్తున్నదని,సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం తగదని ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టరు డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా అధికారులను ఆదేశించారు..సోమవారం కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు వారి తో పాటు డి ఆర్ ఓ విశ్వేశ్వర నాయుడువివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోందన్నారు ఈవేదిక ద్వారా అంతే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని, అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలనన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకం గా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరి గా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని



అధికారులకు సూచించారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలనుపరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.

పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు..అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు..

1) తొండూరు మండలం బక్కాయపల్లె కు చెందిన గంగిరెడ్డి నాకు తొండూరు మండలంలోని సర్వే నెంబర్ 1044/1లొ 1-43 సెంట్లు ఉండగా ఇప్పుడు మళ్ళీ సర్వే చేయగా 0.73 సెంట్లు మాత్రమే వచ్చుచున్నదని రీ సర్వే చేయ వలసిందిగా కోరుతూ అర్జీని సమర్పించారు.

2) వీరపునాయినిపల్లె మండలం పెద్దయ్యగారిపల్లె గ్రామానికి చెందిన సుంకర గణేష్ బాబు నా కుమారుడు పుట్టుక తోనే అంగవైకల్యం తో పుట్టాడని, రిమ్స్ వారు 93% శాతం వికలత్వం ఉన్నదని నిర్ధారించారని,నా కుమారుడు కు పింఛన్ మంజూరు చేయవలసిందిగా అర్జీని సమర్పించారు.

3)పులివెందుల మండలం నాగరిగుట్ట కు చెందిన షేక్ అర్ఫానా నా కూతురుకు పుట్టుకతో మూగ, చెవుడు అని ఆపరేషన్ చేయించినా ప్రయోజనం లేదని పింఛన్ మంజూరు చేయుదురని కోరుతూ అర్జీని సమర్పించారు

4) కడప నగరానికి చెందిన ఎం. జాహ్నవి తన కుల ధ్రువీకరణ పత్రంలో పుట్టిన తేదీ తప్పుగా ఉన్నదని సరిగా దృవికరించాలని అర్జీని సమర్పించారు.

5) ప్రొద్దుటూరు కు చెందిన మహమ్మద్ అరిఫ్ వికలాంగుల పింఛన్ మంజూరు చేయాలని అర్జీని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ ఓబుళమ్మ,డి.ఆర్.డి.ఏ. పి.డి. జి.రాజ్యలక్ష్మి ఎంప్లాయిమెంట్ మరియు టూరిజం శాఖ అధికారి సురేష్ కుమార్, డిప్యూటీ కలెక్టర్లు వెంకటపతి, శిరీష,మరియు ఎస్.ఎస్.ఏ.పిఓ. ప్రేమంత్ కుమార్, మెప్మా పిడి కిరణ్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యల సమగ్ర పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్స్: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

వై ఎస్ ఆర్ కడప, జనవరి 5 (భారత శక్తి): ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సంబంధిత సమస్యలను మరింత సమగ్రంగా పరిష్కరించేందుకు "రెవెన్యూ క్లినిక్స్" కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు.



సోమవారం కలెక్టరేట్ లోని సభా భవన్ ఆవరణలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో నూతనంగా రెవెన్యూ సమస్యల అర్జీల స్వీకరించే.. ఆరు వేర్వేరు సమస్యలకు సంబంధించి "రెవిన్యూ క్లినిక్" కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో అర్జీదారుల నుండి అర్జీలను పరిశీలించిన అనంతరం.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ.. భూ వివాదాల శాశ్వత, సమగ్ర పరిష్కారానికి ప్రతి సోమవారం పిజిఆర్ఎస్ సేవలతో పాటు జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్ ఆవరణం తో పాటు రెవెన్యూ డివిజన్ వారీగా జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు సంతృప్తి స్థాయిలో సేవలు అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి గారు సూచించిన మేరకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు కూడా ప్రభుత్వం నుంచి అందాయన్నారు. ప్రత్యేకంగా ఈ రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమం లో తాసిల్దార్లు, ఆర్డీవో ఒకే చోట ఉండి, రికార్డులన్నింటిని సిద్ధంగా ఉంచుకుని, ఏదైనా గ్రీవెన్స్ వచ్చినప్పుడు అర్జీదారున్ని కూర్చోబెట్టి సావధానంగా విని అక్కడే పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారన్నారు.

అడంగల్ లో మార్పులు చేర్పులు, మ్యుటేషన్స్, పట్టాదార్ పేరు మార్పులు, అసైన్మెంట్ పట్టా, ఎఫ్లైన్, జాయింట్ ఎల్పీఎం సబ్ డివిజన్, 22 ఏ చుక్కల భూముల సమస్యలు, రస్తా, స్మశాన వాటికల సమస్యలు, అలాగే జిల్లాలోని వివిధ మండలాల నుంచి అందిన భూ వివాదాలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, ఆన్‌లైన్ రికార్డుల సవరణ, వారసత్వ నమోదు, ఆక్రమణలపై ఫిర్యాదులు తదితర అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కారం చూపాలనే దిశగా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతి కౌంటర్ లో కూడా ఒక తాసిల్దారు, కలెక్టరేట్ నుంచి సూపరింటెండెంట్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ ఏర్పాటు చేయడం జరిగింది. వచ్చిన అర్జీదారుల సమస్యల కు సంబంధించి అర్జీలను కూడా కౌంటర్ లోనే రాస్తారు. మీసేవ ఏపీ సేవలో ఏదైనా డిజిటలైజ్ చేయాల్సి వస్తే ఎన్రోల్ చేయించి నిర్ణీత కాలపరిమితి లోగా పరిష్కరించేందుకు కృషి చేస్తారు. దీనిపై ఏదైనా ఫిర్యాదు అందిన తర్వాత దాని నమోదు నుంచి పరిష్కరించే వరకు తీసుకోవాల్సిన చర్యలపై తాసిల్దార్లకు, ఆర్డిఓలకు ప్రతివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలిస్తామన్నారు. సమస్యను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయిలోకి వెళ్లారా లేదా, పరిశీలన చేశారా, ఫిర్యాదు పరిష్కరించిన తర్వాత అర్జీదారుకు ఆ ప్రతిని అందజేసినట్లు కూడా పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. మండల స్థాయి సమస్యలపై ప్రజలు కలెక్టరేట్ కు వస్తే పరిష్కారం అవుతాయన్న అపోహను వదలి... స్థానిక సమస్యలను స్థానికంగా ఉన్న ఆర్డిఓ, తాసిల్దారు అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించు కోవాలని పేర్కొన్నారు.


# 7.4 కేజీల గంజాయి పట్టివేత.

కొత్తగూడెం, జనవరి 05 (భారతశక్తి): ఒరిస్సా నుంచి పాల్వంచకు బైక్‌పై తీసుక వస్తున్న 7.4 కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సోమవారం పట్టుకున్నారు. ఖమ్మం డిప్యూటి కమిషనర్ తెలిపిన వివరాల ప్రకారం పాల్వంచ పట్టణ శివారు కేశవాపురం పంచాయితీ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ ఎస్సై శ్రీహరి రావు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా వ్యవహరించిన వ్యక్తుల తనిఖీ చేయగా నిషేధిత గంజాయి తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 7.4 కేజీల గంజాయితో పాటు బైక్‌ను మూడు సెల్ ఫోన్లను గొల్లపల్లి చిరాకుపల్లి కి చెందిన సాంబశివరావు, భూక్య శ్రీహరి, పోతుల చిన్నలను పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. గంజాయిని పట్టుకున్న టీమ్‌ను ఖమ్మం డిప్యూటి



కమిషనర్ జనార్ధన్ రావు, అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్, ఏఈఎస్ తిరుపతిని అభినందించారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 3.50 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు.

# గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం



భద్రాచలం, జనవరి 05 (భారతశక్తి): భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాలకు, 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్లైన్లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కుమారి ఎస్. హేమలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణ గత నెల 11వ తేదీనే ప్రారంభమైందని జనవరి 21 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష రుసుము రూ.100 ఆన్లైన్లో చెల్లించి దరఖాస్తు చేయాలని సూచించారు. ఫిబ్రవరి 22న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఎంపిక చేసిన పరీక్షా కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షలు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ౹ఉ సెట్.సి.జి.జి.జిఓవి.ఇన్ పరిశీలించాలని ప్రిన్సిపాల్ హేమలత కోరారు.

# జనవరి 6న జిల్లాకు తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ పర్యటన

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో పాటు కమిషన్ సభ్యులు ఈ నెల 6న సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.జనవరి 6న ఉదయం హైదరాబాద్ నుండి బయలుదేరి, ఉదయం 10.30 గంటలకు కోహిర్ మండలం సజ్జాపూర్ గ్రామానికి చేరుకుని బ్యాగరి రాములుకు నష్టపరిహారాన్ని పంపిణీచేస్తారనీ,అనంతరం ఉదయం 11.00 గంటలకు జహీరాబాద్ మండలం రంజోల్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ జూనియర్ కళాశాలను సందర్శిస్తారని తెలిపారు.తదుపరి సంగారెడ్డి కలెక్టరేట్‌కు చేరుకుని, మధ్యాహ్నం 2.00 గంటలకు జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తారని, సమావేశంలో భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, ఎస్సీ?ఎస్టీలకు సంబంధించిన ఆర్ఓఆర్ అమలు, బ్యాక్లాగ్ ఖాళీలు తదితర అంశాలపై సమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దారులు, ఎంపీడీవోలు, డీసీఓలు, ఆర్సీఓలు, సంగారెడ్డి మరియు జహీరాబాద్ మునిసిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ /పబ్లిక్ ప్రాసిక్యూటర్ తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

# గురు స్వామి నర్సారెడ్డికి ఘన సన్మానం ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వి.శోభారాణి, వి.సత్యనారాయణ గౌడ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 05 (భారత శక్తి): సోన్ మండలం కద్తాల్ గ్రామంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ గురు స్వామి నర్సారెడ్డిని ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వి. శోభారాణి,నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షులు వి. సత్యనారాయణ గౌడ్ దంపతులు ఘనంగా సన్మానించారు.



ఈ సందర్భంగా శోభారాణి సత్యనారాయణగౌడ్ లు మాట్లాడుతూ సాధారణంగా ఉన్న అయ్యప్ప ఆలయాన్ని 33 సంవత్సరాలుగా రాత్రి,పగలు అనే తేడా లేకుండా కృషిచేసి ఆలయాన్ని అభివృద్ధి చేశారని నర్సారెడ్డి గురు స్వామి సేవలను కొనియాడారు. ఆయన నిస్వార్థంగా ఆలయాన్ని తీర్చిదిద్దడంలో ఆయన అందించిన సేవలు అమోఘం అన్నారు. ఆలయ అభివృద్ధిని చూసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తో పాటు నిజామాబాద్ మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శనం చేసుకుంటున్నారని, దీక్షలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన ఆధ్యాత్మిక స్ఫూర్తి అందరికి ఆదర్శం అన్నారు. సన్మాన కార్యక్రమంలో జాఫ్రాపూర్ మాజీ సర్పంచ్ సాయారెడ్డి స్వామి, కద్తాల్ మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేవేందర్ గౌడ్, మంజులాపూర్ మాజీ వైస్ చైర్మన్ బర్మ గంగా దాస్ పాల్గొన్నారు.

# బిజెపిలో చేరిన సాహితీ హాస్పిటల్ అధినేత రాము

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, జనవరి 5:

సంగారెడ్డి పట్టణానికి చెందిన సాహితీ హాస్పిటల్ అధినేత రాము గురు స్వామి బీజేపీలో చేరారు. ఎంపీ రఘునందన్ రావు, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకొని భారతీయ జనతా పార్టీలో అధికారికంగా చేరారు.ఈ సందర్భంగా రాము గురు స్వామి



మాట్లాడుతూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డి మున్సిపాలిటీలో చైర్మన్ పీఠాన్ని బీజేపీ దక్కించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీని మరింత బలోపేతం చేయడంలో ముందుంటానని, బీజేపీ కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి దేశ్ పాండే, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి పోచారం రాములు, ముత్తిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, నర్సింగరావు, పవన్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షులు కసినివాసు, దోమల విజయకుమార్, మందుల నాగరాజ్, క్రాంతి, అజయ్, శ్రీనివాసరెడ్డి, కంది శివ కుమార్, విట్టల్ దాస్, ప్రభాకర్, శ్రీధర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్నోవేషన్ డే లో ఐఐటి విద్యార్థుల టాలెంట్

## - ఐఐటిహెచ్ లో సంస్కృతి సృజనాత్మక కళలకేంద్రం




సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 5:

సంగారెడ్డి ఐఐటీ హైదరాబాద్ వేదిక సంస్కృతి సృజనాత్మకు అద్దం పట్టేలా పది ఐఐటీలకు చెందిన వెయ్యి మంది విద్యార్థి మేధావులు తయారుచేసిన కొత్త పరికరాలను వేడుకల్లో ప్రదర్శించారు. మొదటగా 2014లో ఐఐటి హెచ్ ప్రారంభమైంది. కాలిగ్రఫీలో శిక్షణ శిక్షణలో ఇంగ్లీష్ వర్డ్స్ వ్రాయటం ఎలా నేర్పించారు. సృజనాత్మతా కలలకు సంబంధించిన ఐఐటీలో దేశంలోనే మొదటగా నిలిచింది. అందులో మైక్రో ఇమేజింగ్ డివైన్ రూపంలో ప్రతిపక్ష చాటిన ఆర్కియా, సుప్రతిని విద్యార్థులకు మొదటి బహుమతి కింద ఐదు లక్షల నగదు చెక్కును బహుమతిగా అందజేశారు. అలాగే ఫ్లయింగ్ బైక్ పేరిట చేపట్టిన ప్రదర్శన డెలికేట్స్ ను ఎంతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐఏఎస్ అధికారి జయసు రంజన్, టీ హబ్ సీఈఓ కవికృత్, ఐఐటి బోర్డ్ ఆఫ్ గవర్నర్ బి వి మోహన్ రెడ్డి, డైరెక్టర్ బిఎస్ మూర్తి మరియు ప్రొఫెసర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలతో సమావేశం: ఇంచార్ మున్సిపల్ కమిషనర్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో జనవరి 05 (భారతశక్తి)రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు భైంసా మున్సిపాలిటీ పరిధిలో రూపొందించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాపై చర్చించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల



ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఇంచార్ మున్సిపల్ కమిషనర్ భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ ( ఐఏఎస్) తెలిపారు.ఈ సమావేశం రేపు మధ్యాహ్నం 3.00 గంటలకు భైంసా మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరుగుతుందని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేరు చేర్పు, తొలగింపు, సవరణలపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

అందువల్ల గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరై సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరవేయాలని దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు,కార్యదర్శి అధ్యక్షతన సంగారెడ్డి పట్టణ 38 వార్డుల నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరై దిశ నిర్దేశం చేశారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయాలని అయన పిలుపునిచ్చారు.పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రతి వార్డులో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హామీల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని గుర్తు చేసారు.నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో పని చేస్తే మున్సిపల్ ఎన్నికల్లో ఘన విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే విశ్వాసం వ్యక్తం చేశారు.అధికారం లేదని అధైర్య పడాల్సిన పనిలేదు అని రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వం అని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ తరుపున మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.రిజర్వేషన్ ఏది వచ్చిన ఐక్యంగా, కలసి పని చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమం లో హక్కీమ్, మాజీ సీడీసీ చైర్మన్ లు విజేందర్ రెడ్డి, కాసాల బుచ్చిరెడ్డి, మందుల వరలక్ష్మి, డా. శ్రీహరి, వేణుగోపాల స్వామి, లక్ష్మి, పట్టణ నాయకులు, కార్యకర్తలు, మాజీ కౌన్సిలర్ లు హాజరయ్యారు.



# జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం

## - హెల్త్ క్యాంప్ ప్రారంభించిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సారథ్యంలో, ఫసల్ వాదిలోని జ్యోతిర్వాస్థు విద్యాపీఠంలో స్వచ్ఛంద రక్త దాన శిబిరం, ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. హెల్త్ క్యాంప్ లో భాగంగా పంటి పరీక్షలు, కంటి పరీక్షలు, ఈసిజి వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, మహేశ్వర శర్మ సిద్ధాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్త దానం ద్వారా ఎంతో మంది ప్రాణాలనుకాపాడవచ్చాన్నారురక్తదానం అన్ని దానాల కంటే విలువైనదని, ముఖ్యమైనదన్నారు. ప్రతీ ఒక్కరూ రక్త దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, ప్రముఖ



వైద్యుడు డాక్టర్ శ్రీధర్, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, విద్యాపీఠం సేవకులు పాల్గొన్నారు.

# జేఎన్టీయూహెచ్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన

హైదరాబాద్ భారత శక్తి ప్రతినిధి, జనవరి 05:

జేఎన్టీయూహెచ్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు జీ.ఓ 11ను ఉద్యోగంలో చేరిన తేదీ నుంచే అమలు చేసి, పెండింగ్ బకాయిలను చెల్లించాలని కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. 2018 నుంచి జీతాలు బకాయిలుగా ఉండడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. సోమవారం నుండి యూనివర్సిటీ లో ''చాక్ డౌన్'' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు బి. సురేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి డా. ఎస్. శివా రెడ్డి తెలిపారు. తమకు న్యాయం చేసే వరకు క్లాసులకు హాజరు కాబోమని తెలిసి చెప్పారు.

========================

# కోర్టు భవనాల నిర్మాణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలి: హైకోర్టు న్యాయమూర్తి సుజన

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 05 (భారత శక్తి):నూతన కోర్టు భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి సుజన అన్నారు. సారంగాపూర్ మండలం చించోలి. బి గ్రామ సమీపంలో పలు కోర్టుల భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు సుజన, లక్ష్మణ్, నర్సింగ్ రావు, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ లు పాల్గొన్నారు.

ముందుగా కోర్టు భవనాల నిర్మాణానికి సంబంధించి భూమి పూజ చేశారు. శిలాఫలకాలను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా న్యాయమూర్తి సుజన మాట్లాడుతూ, జిల్లాలో నూతన కోర్టు భవనాలకు భూమి పూజ చేయడం సంతోషకరమైన విషయమని వివరించారు. కోర్టు భవనాలను త్వరితగతిన పూర్తి చేసి న్యాయ సేవలకు వినియోగంలోనికి తీసుకురావాలని పేర్కొన్నారు.

నూతన కోర్టు భవనాలకు అనువైన స్థలం కేటాయించడం గొప్ప విషయం:

హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్.

జిల్లాలో నూతన కోర్టు భవనాల నిర్మాణానికి చక్కని



చదునైన స్థలాన్ని అధికారులు కేటాయించడం ఎంతో సంతోషకరమైన విషయమని వివరించారు. కోర్టులను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు త్వరితగతిన న్యాయ సేవలు అందించడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. కోర్టు భవనాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు.

కోర్టుల ఆధునీకరణ ద్వారా న్యాయ సేవలో వేగం పెరుగుతుంది:

హైకోర్టు న్యాయమూర్తి నర్సింగ్ రావు.

కోర్టులు ఆధునీకరణ చెందడం ద్వారా, అధునాతన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా సమాజానికి న్యాయ సేవలు మెరుగ్గా, త్వరితగతిన అందించడానికి వీలు కలుగుతుందని హైకోర్టు న్యాయమూర్తి నర్సింగ్ రావు అన్నారు. జిల్లాలో నూతనంగా 12 న్యాస్థానాల భవనాలకు శంకుస్థాపనలు చేయడం శుభపరిణామం అని సంతోషం వ్యక్తం చేశారు.

నూతన కోర్టు భవనాల నిర్మాణంతో ప్రజలకు లాభం చేకూరుతుంది:

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

నూతన జిల్లా కోర్టు భవనాల నిర్మాణంతో ప్రజలకు న్యాయవాదులకు ఎంతో లాభం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. చించోలి.బి గ్రామ సమీపంలో నూతన కోర్టు భవనాలను నిర్మించుకోవడం ఎంతో సంతోషకరమైన విషయం అని అన్నారు. ప్రధాన న్యాయస్థానం పాటు, సీనియర్ జూనియర్ సివిల్ సెషన్స్ పోక్సో, ఎస్సీ, ఎస్టీ, ఫ్యామిలీ న్యాయస్థానాలతో సహా మొత్తం 12 కోర్టు భవనాలను నిర్మించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కోర్టు భవన నిర్మాణాలు అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలతోపాటు న్యాయమూర్తులకు, కోర్టు అధికారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. కోర్టు భవనాల నిర్మాణ పనులు నిర్ణిత గడువులోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, ఎస్పీ జానకి షర్మిలలు మాట్లాడుతూ, నూతన భవనాల నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపనలు చేయడానికి హైకోర్టు న్యాయమూర్తులు జిల్లాకు రావడం సంతోషకరమైన విషయమని తెలిపారు. నూతన న్యాయస్థానాల భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తి కావాలని ఆకాక్షించారు.

కార్యక్రమానికి హాజరైన న్యాయమూర్తులు, కలెక్టర్ ను శాలువాలతో సన్మానించి, వారికి జ్ఞాపికలు అందజేశారు

అంతకుముందు జిల్లా కేంద్రానికి చేరుకున్న న్యాయమూర్తులకు, అటవీ శాఖ వసతిగృహంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు సాయికుమార్, ఉపేందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లారెడ్డి, ఇతర అధికారులు, కోర్టు అధికారులు, న్యాయమూర్తులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

Penta Reddy Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No. 1-173,